డా॥ వై.ఎస్.ఆర్.

# రైతు భరోసా

వ్యవసాయ, ఉద్యాన, మరియు పట్టు పరిశ్రమ రైతుల సచిత్ర మాస పత్రిక

సంపుటి - 02 సంచిక - 10 ఏప్రియల్ 2022 పేజీలు - 44 వెల : రు. 25/-



## అభివృద్ధి వికేంద్రీకరణకు నాంది

### పార్లమెంటు నియోజకవర్గ ప్రాతిపదికగా కొత్త జిల్లాల ఏర్పాటు



## అదనంగా ఆవిర్భవించిన 13 జిల్లాలు



## ఒక్క ఫోన్ కాల్‌తో రైతు సమస్యల పరిష్కారం



## వ్యవసాయశాఖ మంత్రిగా కాకాణి గోవర్ధనరెడ్డి



# GAP - మంచి వ్యవసాయ పద్ధతులు

## ఆహార భద్రత పొలం నుంచే మొదలవుతుంది.


















### చేయవలసినవి :

- క్షేత్ర చరిత్ర, యాజమాన్యం, ముఖ్య సమాచారమును రాసి భద్రపరచుకోవాలి. నేల, సాగునీటి పరీక్ష చేయించుకోవలెను.
- నాణ్యమైన, ఆరోగ్యవంతమైన మరియు చీడపీడలను తట్టుకొనే సిఫారసు చేసిన రకాల విత్తనములను ఉపయోగించాలి.
- ఎరువులు, సస్యరక్షణ మందులు వాడిన సమాచారమును భద్రపరచుకోవాలి.
- సమగ్ర సస్యరక్షణ, సమగ్ర పోషక యాజమాన్య పద్ధతులు చేపట్టి, నమోదు చేయాలి.
- సస్యరక్షణ మందుల ఖాళీ డబ్బాలను, పెట్టెలను, సీసాలను, వాడకుండా, మిగిలిన గడువు దాటిన సస్యరక్షణ మందులను నిర్దేశిత ప్రదేశములలోనే పారవేయాలి.
- నిషేధిత రసాయనాలను వాడకూడదు.
- సస్యరక్షణ మందులు పిచికారీ లేదా చల్లేటప్పుడు రక్షణ దుస్తులను ధరించాలి. ప్రథమ చికిత్స, అత్యవసర ఫోను నెంబర్లు అందుబాటులో ఉండాలి.
- పొలములో పనిచేసేవారి ఆరోగ్యం, భద్రత సంక్షేమం గమనించి, ఆపదల విశ్లేషణ చేయాలి.
- జీవవైవిధ్యం, పర్యావరణంపై వ్యవసాయము ప్రభావము లేకుండా చూడాలి.
- జాడ తెలుసుకొనే వ్యవస్థ ఉండాలి.
- వ్యవసాయ ఉత్పత్తులను రవాణా చేసేటప్పుడు తప్పక కప్పి రవాణా చేయాలి

### చేయకూడనివి :

- సమస్యాత్మకమైన పొలమును పంటలు పండించడానికి ఉపయోగించుట.
- కలుషితమైన నీటిని సాగునకు ఉపయోగించుట
- సిఫారసు చేయని రసాయనాలను, సస్యరక్షణ మందులను వాడుట
- నిషేధిత రసాయనాలను ఉపయోగించుట
- బఫర్‌జోన్‌ను పాటించకపోవడం
- సరైన రక్షణ, ఆచ్ఛాదన లేకుండా వ్యవసాయ ఉత్పత్తులను రవాణా చేయడము.
- రక్షణ దుస్తులు లేకుండా సస్యరక్షణ మందులను వాడుట










## విషయసూచిక

ఏప్రియల్ – 2022

**సంపాదకీయం**


| | | |
|---|---|---|
| 1. | 2023 ఖరీఫ్‌కు పోలవరం | 5 |
| 2. | ఆర్బీకేల పనితీరు ఆదర్శనీయం, రూ. 1,395 కోట్లతో బిందు పరికరాలు | 7 |
| 3. | అందుబాటులో యంత్ర పరికరాలు | 8 |
| 4. | రైతు సమస్యల పరిష్కార కేంద్రం | 9 |
| 5. | ఉచిత పంటల బీమా... రైతుకు ఎనలేని ధీమా... | 11 |
| 6. | ఔషధాల సమ్మేళనం కలబంద | 13 |
| 7. | సేంద్రియ కొలువు – వానపాముల ఎరువు | 15 |
| 8. | వేసవి కూరగాయల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు | 17 |
| 9. | నానో యూరియాతో సుస్థిర వ్యవసాయం | 19 |
| 10. | చిత్రమాలిక | 22 |
| 11. | కార్శీ చెరకు తోటలతో అధిక నికర ఆదాయం | 24 |
| 12. | ఉల్లిలో సమగ్ర పంట యాజమాన్యం | 26 |
| 13. | మామిడిలో మేలైన దిగుబడికి సూచనలు | 28 |
| 14. | వేసవిలో అరటి తోటల యాజమాన్యం | 30 |
| 15. | నేల విడిచి వ్యవసాయం – హైడ్రోపోనిక్స్ | 32 |
| 16. | ఉద్యానం స్కందఫలం.. ఉత్తరాదికి వరం | 35 |
| 17. | సమీకృత రైతు సమాచార కేంద్ర వాట్సప్ నెంబర్లకు వచ్చిన రైతుల సందేహాలు – సమాధానాలు | 37 |
| 18. | సందేహాలు – సమాధానాలు | 39 |
| 19. | సమీకృత రైతు సమాచార కేంద్రానికి రైతులు తరచూ అడిగే ప్రశ్నలు | 41 |
| 20. | సమీకృత రైతు సమాచార కేంద్రంపై రైతుల స్పందన | 42 |



డా॥ వై.ఎస్.ఆర్. రైతు భరోసా సచిత్ర మాసపత్రిక సంవత్సర చందా – రూ.300/- యూనియన్ బ్యాంక్, గోరంట్ల శాఖ ఖాతా నెం. 069610100200430 కు నేరుగా గూగుల్ పే, ఫోన్ పే ద్వారా పంపవచ్చు. డి.డి.లు పంపాల్సిన చిరునామా : ది ఎడిటర్, డా. వై.ఎస్.ఆర్. రైతు భరోసా మాసపత్రిక, వ్యవసాయ కమీషనర్ కార్యాలయం చుట్టుగుంట, పాత మిర్చియార్డు, గుంటూరు





ప్రధాన సంపాదకులు
**శ్రీ చేవూరు హరికిరణ్,** ఐ.ఏ.ఎస్.
వ్యవసాయ స్పెషల్ కమీషనర్



సంపాదకులు
**శ్రీమతి డి. ప్రమీల**
డైరెక్టర్, ఆత్మ

అదనపు సంపాదకులు
**శ్రీమతి ఎన్. పద్మావతి,** జె.డి.ఎ. (ఆర్‌బికె)
కార్యనిర్వాహక సంపాదకులు
**శ్రీ వి. హరగోపాలరాజు**

సహాయ సంపాదకులు
**శ్రీ ఎన్.సి.హెచ్. బాలు నాయక్,** డిడిఎ
**డా॥ బి.ఎస్. శ్రీనివాసాచార్యులు,** డిడిఎ ఇన్‌చార్జ్
**శ్రీ జె. వెంకటరావు,** ఎడిఎ
**శ్రీ కె. ఆంజనేయ కుమార్,** ఎఒ



*రచనలు పంపాల్సిన చిరునామా :*
వ్యవసాయ కమీషనర్ వారి కార్యాలయం
చుట్టుగుంట, పాత మిర్చియార్డు, గుంటూరు
E-mail : mediaproductionap@gmail.com



డా. వైఎస్ఆర్ రైతు భరోసా సంచిక డిజిటల్ ఎడిషన్
apagrisnet.gov.in అందుబాటులో ఉంది




## సంపాదకీయం

# ముందుంది మంచికాలం

కొత్త కాంతులతో... కోటి ఆశలతో కొత్త సంవత్సరం వచ్చేసింది. దాదాపు రెండున్నరేళ్ళ కరోనా మహమ్మారి పీడన తర్వాత ఇప్పుడిప్పుడే హాయిగా ఊపిరి పీల్చుకోగలుగుతున్నాం. శుభకృత్ నామ సంవత్సరం అందరికీ శుభాలు కలిగిస్తుందని ఆశలు చిగురిస్తున్నాయి. తీవ్రమైన ఆటుపోట్లను, ఆకస్మిక వరదలను తట్టుకుని రాష్ట్రం రైతాంగం గత ఖరీఫ్ కాలంలో అత్యధిక పంట దిగుబడులు సాధించింది. మునుపెన్నడూ లేనంతగా మన రాష్ట్రంలో 2021-2022 సంవత్సరానికి దాదాపు 179 లక్షల మెట్రిక్ టన్నుల ఆహార ధాన్యాలు దిగుబడులు వచ్చాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుత రబీకాలంలో పంటల సాగు ఇనుమడించిన ఉత్సాహంతో సాగుతోంది.

రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా రైతులకు అండదండలుగా నిలుస్తుండడంతో రబీలో మార్చి నెలాఖరు నాటికి... లక్షల హెక్టార్ల భూమి సాగులోకి వచ్చింది. ఇది నిర్ధారిత లక్ష్యంలో 90 శాతం కావడం విశేషం.

వాణిజ్య పంటలయిన మిరప, ప్రత్తి రికార్డు స్థాయి ధరలు పలుకుతూ రైతులకు లాభాల పంట పండిస్తున్నాయి. మిరప దిగుబడులు కొంత తగ్గినప్పటికీ ఎన్నడూ లేనంతగా క్వింటాల్ ధర అత్యంత గరిష్టానికి రూ.20 వేలను తాకి దాదాపు రెండు నెలలుగా అదే ఒరవడి కొనసాగుతూ రైతులను సంతోషపరుస్తోంది. అలాగే పత్తి క్వింటాల్ రూ.11 వేలను తాకి పత్తి రైతులకు లాభాల పంట పండిస్తోంది. మొక్కజొన్న కూడా క్వింటాల్ రూ.2,060 లు పలికి రైతులను మురిపిస్తుంది.

ఇక పండ్లలో రారాజయిన మామిడి సీజన్ ఆరంభం నుంచే మంచి ధర పలుకుతోంది. విదేశాలకు ఎగుమతి కూడా భారీగానే జరుగుతోంది. బంగినపల్లి రకం టన్ను రూ.1.30 లక్షలు పలుకుతోంది.

ప్రభుత్వం కూడా పక్కా ప్రణాళిక ప్రకారం వ్యవసాయ సంక్షేమ పథకాలు అమలు చేస్తోంది. సేవలతో ప్రజలకు మరింత చేరువయ్యేందుకు ప్రస్తుతం ఉన్న 13 జిల్లాలను పార్లమెంటు నియోజకవర్గ ప్రాతిపదికగా 26 జిల్లాలుగా చేసింది. దీనివల్ల అభివృద్ధి వికేంద్రీకరణకు నాంది పలికినట్లయింది. వ్యవసాయ యంత్రాంగం రైతులకు మరింత చేరువ కానుంది. రైతులు జిల్లా వ్యవసాయ అధికారులను కలవాలన్నా తేలిక అవుతుంది. ఏప్రిల్ మూడోవారంలో వైఎస్ఆర్ యంత్ర సేవా పథకం కింద రైతు గ్రూపులకు యంత్ర పరికరాల పంపిణీకి భారీ మేళా నిర్వహించనుంది. మే నెలలో పీఎం కిసాన్, రైతు భరోసా సాయం విడుదల చేయనుంది.

ఇలా పలు పథకాలతో రైతులకు పెట్టుబడి వ్యయం తగ్గించి, నికర, సుస్థిర ఆదాయం పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ధృఢ నిశ్చయంతో కృషి చేస్తోంది. 2020-21లో పొందిన దేశంలోనే వ్యవసాయాభివృద్ధిలో అగ్రగామి స్థానాన్ని నిలబెట్టుకునేందుకు రైతులకు వెన్నుదన్నుగా ఉండేందుకు ప్రణాళికలు అమలు చేస్తోంది. ఈ ప్రోత్సాహం, అండదండలతో రైతులందరూ సుఖ సంతోషాలతో ఉండాలన్నదే ప్రభుత్వ ఆకాంక్ష.

# 2023 ఖరీఫ్‌కు పోలవరం

## సిడబ్ల్యూసీ ప్రధాన డ్యామ్ డిజైన్లు ఆమోదించిన ఏడాదిన్నరలో ప్రాజెక్టును పూర్తి చేస్తాం



ఎన్ని అడ్డంకులు ఎదురైనా, వాటిని అధిగమించి 2023 ఖరీఫ్‌కు పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి శ్రీ వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి తేల్చి చెప్పారు. ప్రధాన డ్యామ్ (ఎర్త్ కమ్ రాక్ ఫిల్ డ్యామ్) డిజైన్లను నెలాఖరులోగా ఆమోదిస్తామని కేంద్ర జల్ శక్తి శాఖ మంత్రి శ్రీ గజేంద్రసింగ్ షెకావత్ హామీ ఇచ్చారని, ఆ మేరకు డిజైన్లను ఆమోదించిన 18 నెలల్లోనే కేంద్ర ప్రభుత్వ సహకారంతో ప్రాజెక్టును పూర్తి చేయడానికి ఉక్కు సంకల్పంతో పనిచేస్తున్నామని చెప్పారు. రాష్ట్ర ప్రజల దశాబ్దాల స్వప్నం పోలవరంను సాకారం చేయడానికి దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి శ్రీకారం చుడితే... ఆయన కొడుకుగా ఆ ప్రాజెక్టును తానే పూర్తి చేస్తానని స్పష్టం చేశారు. శాసనసభ్యుల కోరిక మేరకు పోలవరం ప్రాజెక్టు వద్ద వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ఏర్పాటుచేసి.. ఆ మహానేతకు ప్రాజెక్టును అంకితం చేస్తామన్నారు. దేవుడి దయ.. ప్రజల ఆశీర్వాదంతో ఒక్క పోలవరం ప్రాజెక్టునే కాకుండా రాష్ట్రంలో మూడు ప్రాంతాల్లోని అన్ని ప్రాజెక్టులను ప్రాధాన్యత క్రమంలో వేగంగా పూర్తిచేసి.. వాటి ఫలాలను రైతులకు అందించే దిశగా చిత్తశుద్ధితో అడుగులు వేస్తున్నామని చెప్పారు. శాసనసభలో పోలవరం ప్రాజెక్టు పనుల పురోగతిపై జరిగిన, ప్రస్తుతం జరుగుతున్న పనులను ఫోటోలు, వీడియోలు, ఆధారాలతో సహా వివరించారు. ఈ సందర్భంగా సీఎం ఇంకా ఏమన్నారంటే..

### ఇంకొకరు చేస్తున్నారనే కడుపుమంట

"పోలవరం ప్రాజెక్టుపై చంద్రబాబు రోజుకో తప్పుడు ప్రచారం చేయడం.. ఆయనకు బాజా మోగించే ఎల్లో మీడియాలో దాన్ని ఎత్తుకుని కథనాలను వండి వార్చడం ఈ మధ్యకాలంలో సాధారణమై పోయింది. తాము చేయలేని పనిని ఇంకొకరు చేస్తున్నారనే బాధ, ఆవేదన, అన్నింటికంటే ముఖ్యంగా కడుపుమంట.. ఇవన్నీ ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ5 బ్యానర్ కథనాల్లో మనకు కనిపిస్తున్నాయి.

14 ఏళ్ళు ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తి, 44 ఏళ్ళ రాజకీయ జీవితంలో ఒక్కటంటే ఒక్కటి కూడా మంచిపని లేదు. తన సొంత జిల్లాలో నీటి సదుపాయం కల్పించడానికి ఒక్క ప్రాజెక్టునూ పూర్తి చేయలేదు. ఈ పరిస్థితిలో పోలవరం ప్రాజెక్టు మన హయాంలో పూర్తవుతుంటే చంద్రబాబుకు కడుపు మంటగా వుంది."

విభజన చట్టం ప్రకారం పోలవరం ప్రాజెక్టుకు అయ్యే ప్రతి పైసాను కేంద్రమే భరిస్తుంది. 2014లో చంద్రబాబు సీఎం అయ్యారు. 2017 వరకు ప్రాజెక్టు పనులను పట్టించుకోలేదు. కమీషన్ల కోసం కక్కుర్తి పడి.. ప్రత్యేక హోదాను తాకట్టు పెట్టి ప్రాజెక్టు నిర్మాణ బాధ్యతలను తన చేతుల్లోకి తీసుకున్నాడు.

2013-14 ధరల ప్రకారమే పోలవరాన్ని కడతానని ఒప్పు కుంటూ కేంద్రానికి సమ్మతి కూడా తెలిపాడు. ఈ విషయాలన్నింటిపై

అప్పట్లో ఇదే సభలో నేను ఎంతగానో ప్రస్తావించాను. ఏం ప్యాకేజీ తీసుకుంటున్నావ్ చంద్రబాబూ.. మీకు జ్ఞానం ఉందా? నువ్వేం అడుగుతున్నావు? వాళ్లేం ఇస్తున్నారు? (వీడియో ప్రదర్శించారు) అని అడిగితే.. మా గొంతు నొక్కేశారు.

దీనివల్ల కేంద్రం రూ29,027 కోట్లు మాత్రమే ఇస్తానంటుంది. మేం మాత్రం పట్టు విడవకుండా 2017-18కి సంబంధించిన రేట్ల ప్రకారం రూ.55,656 కోట్లు ఇవ్వాలని అడుగుతున్నాం. మేం అడిగిన ప్రతిసారీ చంద్రబాబు ఒప్పుకున్నాడు కదా అని వాళ్లంటారు. అసలు ఈ ప్రాజెక్టు పూర్తి చేయాల్సిన బాధ్యత మీదేనని చెబుతున్నాం. ఇలా వాళ్లకు, మాకు మధ్య గొడవ జరుగుతూనే ఉంది. దీనికి తోడు వరదలు, కోవిడ్.. ఇన్ని ఇబ్బందుల మధ్య కూడా ఉక్కు సంకల్పంతో అడుగులు ముందుకు వేస్తున్నాం.

### పునరావాసం పనులు చకచకా

ఐదేళ్ళలో నిర్వాసితులకు పునరావాసం కల్పించడంపై చంద్రబాబు పట్టించుకున్న పాపాన పోలేదు. పునరావాసం కల్పించకుండానే కాఫర్ డ్యామ్ పనులు మొదలు పెట్టేశారు. ఆ పనులు పూర్తయి వుంటే.. ప్రాజెక్టు కోసం భూములిచ్చిన త్యాగమూర్తుల పరిస్థితి ఏంటి? సహాయం చేయలేదు. పునరావాసం కల్పించలేదు. ఇళ్లు కట్టించలేదు. మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రాధాన్యతా క్రమంలో నిర్వాసితులకు పునరావాసం కల్పిస్తున్నాం. ప్రాజెక్టులో మొత్తం 373 జనావాస ప్రాంతాలు ముంపునకు గురవుతుంటే.. ఇప్పటికే 27 జనావాలస ప్రాంతాలను పునరావాస కాలనీలకు తరలించాం. ప్రస్తుతం ఎగువ కాఫర్ డ్యామ్ పూర్తయిన నేపథ్యంలో నీటి మట్టం పెరిగే అవకాశం ఉంది. అందుకే తొలుత 20,496 కుటుం బాలను తరలించాలని లెక్క వేశాం. ఇప్పటికే 7,962 కుటుంబాలను తరలించాం. వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద 3,228 కుటుంబాలకు పునరావాసం కల్పించాం. వాళ్లను తీసేస్తే 17,268 కుటుంబాలకు పునరావాసం కల్పించేందుకు ఇళ్లను వేగంగా కట్టిస్తున్నాం. ఇందులో 11,984 ఇళ్లు పూర్తయ్యాయి. మిగతా 5,284 ఇళ్ల పనులు వేగంగా జరుగుతున్నాయి. ఆగష్టులోగా 20,496 కుటుంబాలకు పూర్తి స్థాయిలో పునరావాసం కల్పిస్తాం.

# సేంద్రియ గ్రామాలు

సేంద్రియ సాగును రాష్ట్రంలోని ప్రతి గ్రామంలోనూ పెద్ద ఎత్తున చేపట్టాలని సీఎం వైఎస్ జగన్ సూచించారు. సహజ సాగు విధానాలను కేవలం ప్రయోగశాలలు, కొన్ని ప్రాంతాలకే పరిమితం చేయకుండా రైతులకు పూర్తి స్థాయిలో అందుబాటులోకి తేవాలన్నారు. ఫలితాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రతి ఒక్కరికీ అవగాహన పెంపొందించాలన్నారు. అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్ర సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులకు ప్రచారం కల్పించడంపై గ్లోబల్ అలయన్స్ ఫర్ సస్టెయినబుల్ ప్లానెట్ (జీఎఎస్‌పీ) సంస్థ ప్రతినిధులతో సీఎం జగన్ తన క్యాంపు కార్యాలయంలో చర్చించారు. వ్యవసాయదారుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రవేశపెట్టిన వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల గురించి తెలియజేశారు. ఈ సందర్భంగా సీఎం జగన్ ఏమన్నారంటే...

**ధరల్లో వ్యత్యాసం కనిపించాలి :** సహజ సాగు ఉత్పత్తులకు మంచి ధరలు కల్పించి ప్రోత్సహించేలా సర్టిఫికేషన్ చేపట్టాలి. సాధారణ సాగు పద్ధతుల ఉత్పత్తులకు, సహజ సాగు ఉత్పత్తుల దరల మధ్య తేడా స్పష్టంగా కనిపించాలి. రసాయనాలు, కృత్రిమ ఎరువులను వినియోగించి పండించే ఆహార ఉత్పత్తులు కేన్సర్ లాంటి వ్యాధులకు దారి తీస్తున్నాయి.

**ప్రత్యేకంగా యూనివర్శిటీ :** సహజసాగు విధానాలు కేవలం ప్రయోగశాలలకే పరిమితం కాకూడదు. క్షేత్ర స్థాయిలో అమలు కావాలి. మన దగ్గరున్న ఆర్బీకేలు లాంటి వ్యవస్థలను వినియోగించుకోవడం ద్వారా సహజ సాగు విధానం ద్వారా ఆశించిన మార్పులను సాధించగలుగుతాం. మీ సహకారంతో వ్యవస్థలో మంచి మార్పులు తేవచ్చు. సహజ సాగులో రాష్ట్రాన్ని అంతర్జాతీయ స్థాయిలో నిలబెట్టేలా ప్రత్యేకంగా యూనివర్శిటీ ఏర్పాటు దిశగా కసరత్తు జరుగుతోంది. దీనిపై అధికారులకు ఆదేశాలు ఇచ్చాం. సహజసాగులో గ్రాడ్యుయేషన్ ప్రవేశపెట్టాలని సూచించాం. తద్వారా మెరుగైన శిక్షణ పొందిన విద్యార్థులు బయటకు వస్తారు.

**గ్రామాల్లో సరికొత్త వ్యవస్థ :** దేశ చరిత్రలోనే తొలిసారిగా వ్యవసాయ రంగంలో సరికొత్త వ్యవస్థను తీసుకొచ్చాం. రాష్ట్రంలో దాదాపు 13 వేల పంచాయితీలు ఉండగా 10,777 రైతు భరోసా కేంద్రాలను గ్రామాల్లోనే ఏర్పాటు చేశాం. అగ్రికల్చర్, హార్టీకల్చర్ అసిస్టెంట్లు ఆర్బీకేల్లో విధులు నిర్వహిస్తున్నారు. ప్రతి ఆర్బీకేలో కియోస్క్‌ను కూడా ఏర్పాటు చేశాం. గ్రామాల్లోనే విత్తనాలు, ఎరువులు సరఫరా చేస్తూ రైతును చేయిపట్టుకుని నడిపించే బాధ్యత తీసుకున్నా. సకాలంలో అందించడంతో పాటు నకిలీలు, కల్తీలకు ఏమాత్రం ఆస్కారం లేకుండా ఆర్బీకేలు కేంద్రంగా విక్రయాలు నిర్వహిస్తున్నాం. ప్రభుత్వమే విత్తనాలు ఎరువుల నాణ్యతను నిర్థారించిన తర్వాత రైతులకు అందిస్తున్నాం.

# ఆర్బీకే సేవలు ఆదర్శనీయం

## గవర్నర్ శ్రీ విశ్వభూషణ్ హరిచందన్



ఏకగవాక్ష విధానంలో రైతులకు అవసరమైన సేవలన్నీ అందిస్తోన్న వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలు ఆదర్శనీయమని గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ అన్నారు. దళారుల పాత్ర లేకుండా చివరి ధాన్యం గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేయడం రైతులకు భరోసాను ఇస్తోందని సంతృప్తి వ్యక్తం చేశారు. విజయవాడలోని రాజ్‌భవన్‌లో గవర్నర్‌తో వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పూనం మాలకొండయ్య భేటీ అయ్యారు. ఆర్బీకేల పనితీరు నివేదికను గవర్నర్‌కు సమర్పించారు. త్వరలో తాను ఆర్బీకేలను సందర్శిస్తానని గవర్నర్ చెప్పారు. 5 రాష్ట్రాల ప్రతినిధులు ఏపీలోని ఆర్బీకేలను సందర్శించి అధ్యయనం చేశారని గవర్నర్‌కు పూనం మాలకొండయ్య వివరించారు.

## రూ. 1,395 కోట్లతో బిందు సేద్య పరికరాలు –వ్యవసాయశాఖామంత్రి కాకాణి



రైతులు ఎన్నాళ్ళుగానో ఎదురు చూస్తున్న బిందు, తుంపర సేద్య పరికరాలకు రూ. 1,395 కోట్లు వెచ్చించనున్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ కాకాణి గోవర్ధనరెడ్డి వెల్లడించారు. ఏప్రిల్ 21న బాధ్యతలు స్వీకరిస్తూ.. 3.75 లక్షల ఎకరాల్లో బిందు సేద్య పరికరాల అమరికకు ఈ మొత్తాన్ని కేటాయించే ఫైలుపై ఆయన తొలి సంతకం చేశారు. వైఎస్సార్ యంత్ర సేవా పథకం క్రింద రైతులకు త్వరలో 3,500 ట్రాక్టర్లు ఇవ్వనున్నామని చెప్పారు. సుదీర్ఘ రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి వచ్చినవారు శ్రీ కాకాణి గోవర్ధనరెడ్డి. ఎంఏ, పిహెచ్.డి. చేశారు. నెల్లూరు జిల్లా సర్వేపల్లి నియోజకవర్గం నుంచి రెండుసార్లు ఎమ్.ఎల్.ఏ.గా ఎన్నికయ్యారు. శాసనసభ ప్రివిలేజ్ కమిటీ ఛైర్మన్‌గా కొనసాగుతున్న ఆయన మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణలో భాగంగా ఏప్రియల్ 11న మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ప్రభుత్వం ఆయనకు వ్యవసాయ, మార్కెటింగ్ సహకార, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖలను కేటాయించింది.

# అందుబాటులో యంత్ర పరికరాలు

## మే రెండో వారంలో మెగా మేళా

## చురుగ్గా రైతు గ్రూపుల గుర్తింపు.. ఋణాలకు సన్నాహాలు



డా. వైఎస్ఆర్ యంత్ర సేవా పథకం క్రింద రాష్ట్రంలో రైతు గ్రూపులకు యంత్ర పరికరాలు ఇచ్చేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఈ విషయమై పూర్వపు వ్యవసాయ శాఖ కమీషనర్ శ్రీ హెచ్. అరుణ్ కుమార్ ఏప్రియల్ 1న ఆర్బీకే ఛానల్ ద్వారా వ్యవసాయాధికారులు, సిబ్బందితో వివరంగా మాట్లాడారు. పలు సూచనలు చేశారు. ముఖ్యాంశాలు :

★ రాష్ట్రంలోని రైతు భరోసా కేంద్రాల స్థాయిలో ఏర్పడిన రైతు గ్రూపు సభ్యులకు క్లస్టర్ స్థాయిలో ఏర్పడిన రైతు గ్రూపులకు అద్దె ప్రాతిపదికన యంత్రపరికరాలు అందించాలని గౌరవ ముఖ్యమంత్రివర్యులు నిర్ణయించారు. ఇందులో భాగంగానే వైఎస్ఆర్ యంత్ర సేవా పథకాన్ని 2020-21 నుంచి అమలు చేస్తున్నాం.

★ నలుగురు వంతున ఏర్పడిన రైతు గ్రూపులు దాదాపు నాలుగు వేల గ్రామాల్లో ఇప్పటికే ఏర్పాటయ్యాయి. వరి ఎక్కువగా పండించే ఎనిమిది జిల్లాల్లో క్లస్టర్ స్థాయి గ్రూపులకు హార్వెస్టర్లు ఇవ్వాలని ముఖ్యమంత్రివర్యులు శ్రీ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గారు ఆదేశించారు. ఆర్బీకేల స్థాయిలో 15 లక్షల వంతున, క్లస్టర్ స్థాయిలో రూ. 25 లక్షల వంతున యంత్ర పరికరాలు ఇచ్చేందుకు ఇప్పటికే గుర్తించాం.

★ రైతుల అభ్యర్థన మేరకు వారు కోరుకున్న కంపెనీల ట్రాక్టర్లను అందుబాటులోకి తెచ్చాం. ఆరు కంపెనీల 60 మోడళ్ళ వివరాలను ఇప్పటికే జిల్లాలకు పంపాం. మీ గ్రామానికి అవసరమైనపరికరాలు మీరు కొనుగోలుచేసి అందించ వచ్చు.

★ ఈ పథకంలో పారదర్శకత, మరింత పటిష్ట అమలుకు సబ్సిడీ విధానంలో కొన్ని మార్పులు చేశారు. గౌరవ ముఖ్యమంత్రి వర్యుల సూచన మేరకు యూనిట్ విలువలో 40 శాతం సబ్సిడీని నేరుగా రైతుల ఖాతాలోనే జమ చేస్తాం. 50 శాతం రుణాన్ని ఆప్కాబ్, డీసీసీబీలు సమకూరుస్తాయి. బ్యాంకులు సాధారణంగా 9 శాతం వడ్డీని వసూలు చేసినా, ఇందులో 3 శాతాన్ని బ్యాంకులకు నేరుగా ప్రభుత్వమే చెల్లిస్తుంది. దీనివల్ల వడ్డీ 6 శాతమే అవుతుంది.

★ ఆర్బీకేల్లో యంత్ర పరికరాల అద్దెల వివరాలపై ఒక చిన్న బోర్డు ప్రదర్శించాలి. దీనివల్ల రైతులు వీటిని తేలికగా సద్వినియోగం చేసుకునే వీలుంటుంది.

★ సన్న, చిన్నకారు రైతులందరికీ పెట్టుబడి వ్యయం తగ్గించి, కూలీల కొరతను అధిగమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకమే డా. వై.ఎస్.ఆర్. యంత్ర సేవా పథకం. గ్రామ స్థాయిలో ఇప్పటికే సిహెచ్‌సీలు అందుబాటులోకి వచ్చాయి. రూ. 15 లక్షల వ్యయంతో 10,750 గ్రామ స్థాయిలో, రూ. 25 లక్షల వ్యయంతో 1,615 కేంద్రాలు క్లస్టర్ స్థాయిలో ఇవి ఏర్పాటయ్యాయి.

★ క్లస్టర్ స్థాయి (మూడు, నాలుగు గ్రామాలకు కలిపి) యంత్ర సేవా కేంద్రాల్లో కంబైన్డ్ హార్వెస్టర్, బేలర్ (గడ్డి కోసే, కట్టలు కట్టే యంత్రం) రైతులకు అందుబాటులోకి వస్తాయి.

★ ముఖ్యంగా వరి ఎక్కువగా పండించే కృష్ణా, ఉభయ గోదావరి, గుంటూరు, విజయనగరం, శ్రీకాకుళం, నెల్లూరు, కర్నూలు, కడప జిల్లాల్లో ఈ క్లస్టర్ స్థాయి కేంద్రాలు ఏర్పాటయ్యాయి.

★ నలుగురు రైతుల వంతున ఏర్పడిన రైతు గ్రూపులకు వాటిని ఇవ్వనున్నారు.

★ దేశంలోని ప్రఖ్యాత కంపెనీలతో ప్రభుత్వం సంప్రదింపులు జరిపి, అత్యంత నాణ్యమైన, ధృవీకరించిన యంత్ర సామాగ్రి అందించడానికి కంపెనీలను ఒప్పించింది.

★ కంబైన్డ్ హార్వెస్టర్లకు ఒక అదనపు ట్రాక్ ఉచితంగా ఇవ్వడానికి కంపెనీలు అంగీకరించాయి.

★ వెయ్యి గంటల పనివరకు కంపెనీలు ఉచిత సర్వీసు అందిస్తాయి.

★ ట్రాక్టరు రిజిస్ట్రేషన్ సిహెచ్‌సీ పేరిటే ఉండాలి.

★ వ్యవసాయ శాఖ ఇప్పటికే ఆమోదించిన ట్రాక్టర్లు, మోడళ్లు, ధరలు (జూన్ 30 వరకు అమల్లో ఉంటాయి) వివరాలను ఆయా జిల్లాలకు పంపింది.

★ రైతు గ్రూపు తాము ఎంచుకున్న ట్రాక్టరు మోడల్, ధర, ఇతర ఒప్పంద పత్రాలను బ్యాంకులకు సమర్పిస్తే బ్యాంకులు వెంటనే ఆ సొమ్మును చెల్లిస్తాయి.

★ ఆయా డీలర్లు తమ వద్ద ట్రాక్టర్ల, మోడళ్ళ, ధరల వివరాలతో కొటేషన్లు ముందుగా ఇవ్వాల్సి ఉంటుంది.

★ సీహెచ్‌సీ గ్రూపు తమ వాటా సొమ్ము 50 శాతాన్ని ఆ డీలరుకు బదిలీ చేస్తే, అతను బ్యాంకుకు అభ్యర్థన పత్రం పంపగానే బ్యాంకు మిగతా 50 శాతం సొమ్ము విడుదల చేస్తుంది.

★ ట్రాక్టరు ఇచ్చే రోజున డీలరు సంబంధిత రిజిష్టర్ పత్రాలు, టాక్సు రశీదులను కూడా రైతు గ్రూపునకు ఇవ్వాల్సి ఉంటుంది.




★ ఈ ప్రాథమిక వ్యవహారాలన్నీ పూర్తి చేసుకున్నాక మే రెండో వారంలో వైఎస్ఆర్ యంత్రసేవా పథకం మెగామేళా నిర్వహించనున్నారు.

★ ముఖ్యమంత్రి వర్యుల సమక్షంలో జరిగే ఈ మెగామేళాలో మండలానికి 6 వంతున 4,020 ఆర్బీకే స్థాయి యంత్ర సేవా కేంద్రాలకు 656 క్లస్టర్ యంత్ర సేవా పథకాలకు యంత్ర సామాగ్రి అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

## వ్యవసాయశాఖ స్పెషల్ కమీషనర్‌గా చేవూరు హరికిరణ్



వ్యవసాయశాఖ రాష్ట్ర స్పెషల్ కమీషనర్‌గా శ్రీ చేవూరు హరికిరణ్ ఏప్రియల్ 8న బాధ్యతలు స్వీకరించారు. హరికిరణ్ 2006లో ముంబై ఐ.ఐ.టీ.లో ఎమ్మెస్సీ చదివారు. 2009లో యు.పి.ఎస్సీ. నిర్వహించిన సివిల్ సర్వీస్ పరీక్షలో జాతీయ స్థాయిలో 18వ ర్యాంకు సాధించారు. ఉమ్మడి రాష్ట్రంలో ప్రథముడిగా నిలిచారు. 2010–11లో కృష్ణా జిల్లా శిక్షణ కలెక్టర్‌గా పనిచేశారు. 2011–12లో భద్రాచలం, 2012–13లో మదనపల్లి సబ్ కలెక్టర్‌గా విధులు నిర్వర్తించారు. 2013–15 మధ్య విజయవాడ మున్సిపల్ కమీషనర్‌గా బాధ్యతలు నిర్వహించారు. 2015–17లో కర్నూల్ జాయింట్ కలెక్టర్‌గా పనిచేస్తూ, 2017 మేలో తిరుపతి మునిసిపల్ కమీషనర్‌గా బదిలీ అయ్యారు. 2018 నుంచి కలెక్టర్‌గా కడపలో పనిచేశారు. 2021లో తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. ఆయన తండ్రి వైద్యుడు కాగా, తల్లి ఎం.ఏ., పిహెచ్.డి. చేశారు. ఆయన సతీమణి బి. సుగుణ సింగపూర్‌లో ఎమ్మెస్సీ, పిహెచ్.డీ. చేశారు.

# 155251



# రైతు సమస్యల పరిష్కార కేంద్రం



రైతు సమస్య శాస్త్రవేత్త దృష్టికి...

మట్టిని నమ్ముకుని ఆరుగాలం స్వేదం చిందించి బంగారం పండించే రైతుకు అవసరమైనప్పుడు అండగా నిలవాలి. అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వాలి. శాస్త్ర, సాంకేతిక సహకారం అందించాలి. అప్పుడు ఆ రైతు తక్కువ పెట్టుబడితో మేలైన అధిక దిగుబడి సాధించగలడు. నికర, స్థిర ఆదాయం పొందగలడు. ఇదీ గౌరవ ముఖ్యమంత్రి శ్రీ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గారి ఆలోచన. ఈ ఆలోచనల్లోంచి పుట్టిందే **సమీకృత రైతు సమాచార కేంద్రం (ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్).** రైతుకు ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ఉచిత టోల్ ఫ్రీ నెంబరు 155251 కు ఒక్క ఫోన్ చేస్తే చాలు, రైతు సమస్యకు పరిష్కారం దొరుకుతుంది. వేసవి దుక్కులు, విత్తనం, పంటకు తెగుళ్ళు, మార్కెట్లో మద్దతు ధరలు, ఎరువులు, పురుగు మందులు.. ఏవి, ఎప్పుడు, ఎంత వాడాలి, పంట మార్పిడి ప్రయోజనాలు, మార్కెట్ అవసరాలకు అనుగుణంగా ఎలాంటి పంటలు లాభదాయకంగా ఉంటాయి వంటి ఎన్నో సందేహాలకు ఈ ఫోన్ కాల్ ద్వారా నిపుణులైన సిబ్బంది, అధికారులు, వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు, కృషి విజ్ఞాన కేంద్ర నిపుణులు, అభ్యుదయ రైతులు ఇందులో భాగస్వామ్యం కావడం ఒక ప్రత్యేకత.

వ్యవసాయమే కాదు అనుబంధ రంగాలైన ఉద్యానం, పట్టు పరిశ్రమ, మార్కెటింగ్, పౌల్ట్రీ, మత్స్య, పాడి పరిశ్రమల సమస్యలపై కూడా రైతులు అడిగి తెలుసుకుంటున్నారు. ఆచరిస్తున్నారు. పరిష్కారం పొందుతున్నారు. ఇలా ఒక్క ఫోన్ కాల్‌తో రైతు సమస్యలు పరిష్కరించగలిగిన ఈ సమీకృత రైతు సమాచార కేంద్రం దేశంలోనే మొట్టమొదటిది కావడం మన రాష్ట్ర రైతుల అదృష్టం.

**పథకాల లబ్ధికి :** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు సంక్షేమ పథకాలైన రైతు భరోసా – పీఎం కిసాన్, డా. వైఎస్ఆర్ ఉచిత పంటల బీమా, సున్నా వడ్డీ పంట రుణాలు, పెట్టుబడి రాయితీ, యంత్ర సేవాపథకం ఇలాంటి పథకాల వర్తింపుపై కూడా రైతులు తమ సందేహాలు నివృత్తి చేసుకుని లబ్ధి పొందుతున్నారు.

విజయవాడ సమీపంలోని గన్నవరంలో సకల హంగులతో ఏర్పాటైన ఈ సమీకృత రైతు సమాచార కేంద్రంలో నిపుణులైన 60 మంది సిబ్బంది, అధికారులు, శాస్త్రవేత్తలు రోజులో 12 గంటల పాటు రైతులకు అందుబాటులో ఉంటున్నారు.

ప్ర. హలో రైతు సమాచార కేంద్రమాండీ.. నా పేరు రాజేశ్వరరావు. మాది శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం, భగీరథపురం.. నేను వరి వేసి 80 రోజులైంది. ఈనెలు, గింజలు నల్లగా ఏర్పడుతున్నాయి. అక్కడక్కడ తాలు గింజలు వస్తున్నాయి. నివారణ చెప్పగలరా?

జ. మీ వరి పంటలో కంకినల్లి ఆశించింది. నివారణకు డైకోఫాల్ 5 మి.లీ. లేదా ప్రొఫెనోఫాస్ 2 మి.లీ. ఒక లీటరు నీటికి చొప్పున కలిపి 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయండి. మంచి ఫలితం కనిపిస్తుంది.

| అంశం | వచ్చిన ఫోన్ కాల్స్ |
|---|---|
| వ్యవసాయ రంగ సమస్యలు | 3,83,345 |
| యాంత్రీకరణ సేవలు | 1,840 |
| ఎరువులు | 3,316 |
| విత్తనాలు | 4,818 |
| ప్లాంట్ ప్రొటెక్షన్ | 47,996 |
| కియోస్క్ | 11,564 |
| రైతుభరోసా | 95,370 |
| పి.ఎం. కిసాన్ | 51,342 |
| పంటల బీమా | 47,750 |
| కిసాన్ క్రెడిట్ కార్డులు | 2,062 |
| కౌలు రైతు హక్కు పత్రాలు | 1,142 |
| క్రాప్ ఇన్సూరెన్స్ | 64,230 |
| ఉచిత బోర్లు | 627 |
| పెట్టుబడి రాయితీ | 19,957 |
| ఉద్యానం | 26,847 |
| పశుసంవర్ధక | 10,396 |
| మత్స్య, పట్టు | 42,18,251 |



ప్ర. నేను గుంటూరు జిల్లా వేజెండ్ల నుంచి శ్రీనివాసరావుని మాట్లాడుతున్నా.. మా నిమ్మతోటలో చెట్ల ఆకులపై మచ్చలు వచ్చాయి. సమస్య ఎలా పరిష్కరించాలి?

జ. నిమ్మ చెట్ల ఆకులపై గజ్జి తెగులు వచ్చింది. నివారణకు ప్రతి **10** లీటర్ల నీటికి **30** గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్, **1** గ్రాము స్ట్రెప్టోసైక్లిన్ మందులు కలిపి వారం రోజుల వ్యవధిలో తెగులు తీవ్రత తగ్గే వరకు రెండు, మూడు సార్లు పిచికారీ చేసుకోవాలి.

అన్నదాతల సేవలో..    ఉదయం 7 నుంచి రాత్రి 7 వరకు ..





# ఉచిత పంటల బీమా..
# రైతుకు ఎనలేని ధీమా..

మన రాష్ట్రంలో అమలవుతున్న డా. వై.ఎస్.ఆర్. ఉచిత పంటల బీమా పథకం అత్యంత మెరుగైనది. అది ఎలాగో ఈ విశ్లేషణలో తెలుసుకుందాం: ఎందుకంటే పంటల బీమా చరిత్ర చాలా పెద్దది. 1965 అక్టోబరులోనే కేంద్ర ప్రభుత్వం క్రాప్ ఇన్సూరెన్స్, మోడల్ ఇన్సూరెన్స్ పథకంగా తీసుకొచ్చింది. ఆ తర్వాత 1972–78 మధ్య వ్యక్తిగత అప్రోచ్ స్కీమ్‌గా మార్చింది. మళ్ళీ 1985–86 దేశవ్యాప్త సమగ్ర పంటల బీమా పథకంగా చేసింది. తర్వాత దాన్నే 1999–2000లో జాతీయ వ్యవసాయ బీమా పథకం అంది. కొన్నేళ్ళకు అంటే 2009లో వాతావరణ ఆధారిత పంట బీమా పథకంగా, 2016 ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనగా నవీకరించింది. అయితే అధిక ప్రీమియం రేట్లు, కొన్ని రాష్ట్రాల్లో పరిహారం, ప్రీమియం నిష్పత్తి ఎక్కువ కావడం, పంటకోత ప్రయోగాల్లో లోపాలు, తదితర అనేక కారణాల వల్ల పశ్చిమబెంగాల్, బీహార్, పంజాబ్, తమిళనాడు, జార్ఖండ్, గుజరాత్, తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ లు ఈ పథకాన్ని నిలిపేశాయి. ఉత్తరప్రదేశ్, హర్యానా, రాజస్థాన్, మహారాష్ట్ర కొనసాగించాలా వద్దా అని ఆలోచిస్తున్నాయి. మొత్తం 18 ప్రయివేట్, ప్రభుత్వరంగ కంపెనీల్లో పది మాత్రమే 2020–21లో పాల్గొన్నాయి.

ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర రైతుల ప్రీమియం మొత్తం చెల్లించడంతో పాటు పరిహారాలను సత్వరం పరిష్కరించేందుకు పథకాన్ని ప్రవేశపెట్టింది. దీంతో గుర్తింపు పొందిన పంటలు పండించే రైతులందరికీ పంటలు నష్టపోయి నప్పుడు పరిహారం ఆలస్యం కాకూడదని 2019 జూలై 8న డా. వై.ఎస్.ఆర్. ఉచిత పంటల బీమా పథకాన్ని అమల్లోకి తెచ్చింది. రైతు భరోసా కేంద్రంలో ఒక రూపాయి టోకెన్ చెల్లించి రైతులందరూ ఈ-క్రాప్ బుకింగ్ ద్వారా ఈ పథకంలో నమోదయ్యారు.

ఖరీఫ్ 2020–21 నుంచి ఈ రూపాయి టోకెన్ మొత్తం కూడా తొలగించి ఉచిత పంటల బీమా పథకంగా మార్చారు. మండలాన్ని యూనిట్‌గా తీసుకోవడం వల్ల చిన్న, సన్నకారు రైతులందరికీ లబ్ధి కలుగుతుంది. పంటల బీమా పరిహారం రక్షణ పొందాలంటే ముందుగా రైతులు, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు (ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన) తమ వాటా చెల్లించవలసి ఉంటుంది. ఎవరు ఆలస్యంగా చెల్లించినా బీమా రక్షణ వర్తించదు. దీంతో బీమా కంపెనీల విధిని తానే నిర్వహించాలని నిర్ణయించి రాష్ట్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ జనరల్ ఇన్సూరెన్స్ కార్పోరేషన్ లిమిటెడ్‌ను ప్రారంభించింది. 2019–21 మధ్య పంటల బీమా కోసం నమోదు చేసుకున్న రైతుల సంఖ్య గత మూడేళ్ల సగటుతో పోలిస్తే 198.57 శాతం పెరగడం గమనార్హం. అదే సమయంలో పంట విస్తీర్ణం 128.51 శాతం పెరిగింది. అలాగే బీమా మొత్తం 128.69 శాతం పెరిగింది. రాష్ట్ర ప్రీమియం వాటా 2018–19లో 38.02 శాతం నుంచి 2019–20 లో 65.85 శాతానికి పెరిగింది. రైతుల వాటా పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వమే భరించడం వల్ల రైతులపై ఒత్తిడి తగ్గి భాగస్వామ్యం పెరుగుతుంది. కొత్త వ్యవస్థ పీఎంఎఫ్‌బీవై నిబంధనలకు సరిపోనందున, 2020–21 సీజన్లకు వాటా చెల్లించడానికి కేంద్రం నిరాకరించింది. ఖరీఫ్ 2020–21 నుంచి కేంద్ర ప్రభుత్వం

చెల్లించాల్సిన ప్రీమియం వాటాను కూడా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వమే చెల్లించి బీమా పరిహారాలకు శ్రీకారం చుట్టింది.

రాష్ట్ర ప్రభుత్వం 2021 నుంచి దిగుబడి ఆధారిత 21 పంటలను, వాతావరణ ఆధారిత 9 పంటలను ఈ బీమా పథకంలో చేర్చింది. పంటకోత ప్రయోగాల ఫలితంగా 2020-21లో 13 లక్షల మంది రైతులు రూ. 1739 కోట్ల మేర ఈ పథకం ద్వారా లబ్ధి పొందారు.

ఉచిత విద్యుత్తు ఇన్‌పుట్ సబ్సిడీ, రైతు భరోసా పథకాలతో ఉచిత బీమా పథకం కింద ప్రయోజనం పొందిన రైతుల సంఖ్య 2018-19లో 64.20 శాతం నుంచి 2019-20 కి 10.30 శాతానికి తగ్గింది.

ఈ పథకంలో మరో ముఖ్యాంశం కౌలు రైతులకు లబ్ధి, యాజమాన్య హక్కులకు భంగం కలగకుండా రాష్ట్ర ప్రభుత్వం జారీ చేస్తున్న కౌలుదారుల సాగుహక్కు పత్రాలతో వాస్తవ సాగుదారులకు ప్రయోజనం కలుగుతోంది. ఈ పథకాన్ని మరింత పకడ్బందీగా అమలు చేయడానికి, మరింతమంది రైతులకు ప్రయోజనం కలిగించడానికి ఈ కింది సూచనలు పరగణనలోకి తీసుకోవాలి.

★ ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన మాదిరి తీవ్రమైన చీడపీడలు, క్రిముల దాడివల్ల సంభవించే పంట నష్టాల నుండి నిర్దిష్ట ప్రాంత రైతులను కాపాడడానికి ప్రభుత్వం చొరవ చూపాలి. ఉదా: మిరపపై తామర తెగులు

★ పంటల బీమా పరిధిలోకి ఎక్కువ మంది రైతులను చేర్చడానికి ప్రయత్నాలు కొనసాగించాలి.

★ ఈ క్రాప్, సీసీఆర్‌సి కార్డుల విధానం కొనసాగించాలి.

★ పంటల మార్పిడిని ప్రోత్సహించడానికి నిర్దిష్ట గ్రామంలో పండించే ప్రధాన పంటలను చేర్చాలి. ప్రస్తుతం ఒక్క ప్రధాన పంటను మాత్రమే గ్రామ పరిధిలోకి అనుమతిస్తున్నారు.

**డా. జి. రఘునాథ్ రెడ్డి, డా. ఎం. చంద్రశేఖర్‌రెడ్డి,**
**ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం**

## ఆంధ్రప్రదేశ్‌లో 2016-17 నుండి 2020-21 వరకు పంటల బీమా వివరాలు

| వివరాలు | గత కాలం | | | ప్రస్తుతం | |
|---|---|---|---|---|---|
| | 2016-17 | 2017-18 | 2018-19 | 2019-20 | 2020-21 |
| పథకం పరిధిలోకి వచ్చిన రైతు సంఖ్య (లక్షల్లో) | 17.79 | 18.22 | 24.83 | 49.81 | 71.30 |
| విస్తీర్ణం (లక్ష హెక్టార్లలో) | 20.44 | 24.28 | 25.99 | 45.96 | 61.75 |
| బీమా మొత్తం (రూ. కోట్లలో) | 10804 | 12625 | 14025 | 29875 | 27230 |
| రైతు ప్రీమియం (రూ. కోట్లలో) | 347.96 | 261.29 | 262.01 | 0.26 | శూన్యం |
| ప్రీమియంలో కేంద్ర వాటా (రూ. కోట్లలో) | 228.06 | 535.56 | 415.62 | 503.36 | శూన్యం |
| ప్రీమియంలో రాష్ట్ర వాటా (రూ. కోట్లలో) | 228.06 | 535.56 | 415.62 | 971.23 | శూన్యం |
| స్థూల ప్రీమియం (రూ. కోట్లలో) | 804.08 | 1332.41 | 1093.25 | 1474.85 | శూన్యం |
| చెల్లించిన పరిహారాలు (రూ. కోట్లలో) | 954.74 | 720.60 | 1860.28 | 1252.18 | 1739.00 |
| ప్రయోజనం పొందిన రైతుల సంఖ్య (లక్షల్లో) | 8.70 | 6.76 | 15.94 | 9.48 | 13.00 |
| క్లెయిమ్‌లకు వ్యతిరేకంగా ప్రీమియం నిష్పత్తి | 1.19 | 0.54 | 1.70 | 0.85 | శూన్యం |

# ఔషధాల సమ్మేళనం కలబంద



ఈ మొక్కలను సంస్కృతంలో "కుమారి" అని పిలుస్తారు. కాండం లేకుండా, పొడుగ్గా, మందంగా ఉండే ఆకులు/ మట్టలతో కలిగి ఉంటుంది. ఒక్కొక్క ఆకు సుమారు 60 సెం.మీ. వరకు పొడవు పెరుగుతుంది.

**అనుకూల వాతావరణము :** అన్ని రకాల వాతావరణాల లోనూ సాగు చేయవచ్చు. వర్షాపాతం35-40 సెం.మీ. నుండి 150-200 సెం.మీ. ఉండే ప్రాంతాలలో సాగు చేయవచ్చును.

**అనుకూల నేలలు:** అన్ని రకాల నేలల్లో సాగు చేయవచ్చు. ఉదజని సూచిక 8.5 వరకు ఉంటే సరిపోతుంది.

**ప్రవర్ధనం :** వేరు పిలకలు లేదా వేరు కొమ్ము కత్తిరింపుల ద్వారా ప్రవర్ధనం చేయాలి.

**నాటే సమయం :** జూన్-జూలై నెలల్లో నాటుట శ్రేష్టం. కనీసం 15-20 సెం.మీ. పొడవు కలిగిన పిలకలను 60 x 45 సెం.మీ. దూరంలో నాటాలి. నాటిన వెంటనే నీరు పెట్టాలి. డ్రిప్ పద్ధతిలో నీరు అందిస్తే ఆకులు బాగా మందంగా పెరుగుతాయి.

**ఎరువుల యాజమాన్యము :** ఒక ఎకరాకు సుమారు 5 టన్నుల పశువుల ఎరువు ఆఖరి దుక్కిలో వేయాలి. దీనితోపాటు 20 కిలోల నత్రజని, 20 కిలోల భాస్వరం మరియు 20 కిలోల పొటాష్ ఎరువులువేసుకోవాలి. వర్మి కంపోస్టు ఎకరాకు 2 టన్నుల చొప్పున వేసినట్లయితే అధిక దిగుబడులు పొందవచ్చు. అజోస్పైరిల్లం వంటి జీవన ఎరువును కూడా వినియోగించవచ్చు.

**అంతర కృషి :** సంవత్సరంలో 4-5 సార్లు కలుపును తీయాలి. వేసవిలో కనీసం 20 రోజులకు ఒకసారి నీరు పెట్టాలి.

**సస్య రక్షణ :** పెద్దగా అవసరం లేదు కాని ఆకుముడత, ఆకుకుళ్ళు, వ్యాధులు ఆశించినపుడు 2 గ్రా. డైథేన్ యం.-45, ఆకునల్లి ఆశించినప్పుడు 2 మి.లీ. క్లోరోపైరిఫాస్ ఒక లీటరు నీటికి కలిపి వారానికి ఒకసారి పిచికారి చేయాలి.

**కోత :** నాటిన 8-10 నెలలకు కోతకొస్తుంది. ముదిరిన ఆకులను మాత్రమే కోయాలి. ప్రతీ మూడు నెలలకు ఒక కోత తీసుకోవచ్చు. మొక్కలను తీసివేసి వేరు భాగమును భూమిలోనే వదిలేస్తే తిరిగి మొలకెత్తుతుంది. ఇలా 4-5 సంవత్సరాల వరకు ఉంచుకోవచ్చు.

**దిగుబడి :** ప్రతికోతకు ఎకరాకు 15-20 టన్నుల తాజా ఆకు లభిస్తుంది.

**ఆదాయ వ్యయాలు :** ఎకరాకు రూ. 15,000 - 20,000 ఖర్చు. రూ. 40,000 మొత్తం ఆదాయం. తద్వారా రూ. 15,000 - 20,000 నికర ఆదాయం లభిస్తుంది. దీని ఆకుల నుండి జెల్ తయారు చేయగలిగిన యెడల ఇంకా ఎక్కువ ఆదాయం పొందవచ్చు. సమీపంలో ప్రొసెసింగ్ ఫ్యాక్టరీ మరియు సరియైన బై బ్యాక్ సదుపాయం ఉన్న రైతులు మాత్రమే దీనిని సాగుచేసుకోవాలి. లేని యెడల మార్కెటింగ్ సమస్య తలెత్తుతుంది.

**ఉపయోగాలు:**

- కలబందను అనేక ఔషధాల తయారీలోనూ సౌందర్య సాధనాల తయారీలోనూ వినియోగిస్తారు.
- కలబంద పత్రాలను కోసినపుడు స్రవించే జిగురు వంటి పసుపు రంగు స్రావం (ఆలోయిన్)ను ఎండబెట్టి నల్లని మూసాంబరము తయారు చేసి విరేచనకారిగా, నొప్పులను హరించే ఔషధంగా వినియోగిస్తారు.
- కలబందను కాలిన గాయాలకు కూడా ఔషదంగా వినియోగించవచ్చును.
- కలబంద చర్మ వ్యాధులు మరియు అల్సర్స్ ను నివారించగల



ఎన్నో రకాలైన యాంటీ మైక్రోబియల్ గుణములు కల్గి ఉన్నాయి.

- శరీర ఎదుగుదల మరియు పోషణకు అవసరమైన 20 వరకు అమైనో ఆసిడ్స్ ను కలిగి ఉన్నాయి.
- ఆయుర్వేద మందుల తయారీలో అలోవెరా జెల్ ను రక్త ప్రసరణ, కాలేయం, కిడ్నీలు, జీర్ణకోశ, స్త్రీల గర్భాశయ సంబంధ వ్యాధుల నివారణకు ఉపయోగిస్తారు.
- నూతన పరిశోధనలలో అలోవెరా జెల్ ను కాన్సర్ నిరోధక మందులలో ఉపయోగిస్తున్నారు. కాన్సర్ తో పోరాడే కణాల వృద్ధికి దోహదపడుతుంది. అత్యధిక రోగ నిరోధక శక్తిని కలిగి ఉంటుంది.

**అలోవెరా (కలబంద) లోని అద్భుత ఆయుర్వేద ఔషధ లక్షణాలు**

మనలో చాలా మంది ఇళ్ళలో కలబంద దానంతటఅదే పెరుగుతూ ఉంటుంది. ఎక్కువ నీరు పొయ్యకపోయినా బతికే ఎడారి మొక్క. కానీ దానిలో ఉన్న ఔషధ లక్షణాలు తెలిస్తే ఆశ్చర్యం కలగక మానదు. వేడి వాతావరణంలో పెరిగే ఈ మొక్కను నీడలో, ఎండలో ఎక్కడైనా పెంచుకోవచ్చు.

- అలోవెరా (కలబంద) ఓ ఔషధ మొక్క. కాస్మెటిక్, ఫుడ్, స్కిన్ కేర్ ప్రోడక్ట్స్ లో దీన్ని ఎక్కువగా ఉపయోగిస్తున్నారు.
- కలబందలో ఉండే గుజ్జు 96% నీటి తోనే తయారవుతుంది. శతాబ్దాలుగా అలోవెరాను సంప్రదాయ ఔషధ మొక్కగా వాడుతున్నారు.
- కలబందలో గాయాలను మాన్పించే గుణాలు, చర్మాన్ని కోమలంగా మార్చే లక్షణాలు ఉన్నాయి.
- కలబంద గుజ్జును, కొబ్బరి నూనెనూ కలిపి దాన్ని తలకు పట్టిస్తే జుట్టు మెరుగు పడుతుంది. చుండ్రు వదిలిపోతుంది. మృత కణాలు తొలిగిపోతాయి. జుట్టు రాలిపోయేవారు ఇలా చేయడం వల్ల మంచి ఫలితాలుంటాయి.
- కలబందలోని పోషకాలు, ఎంజైములు, అమైనో ఆసిడ్లు, ఖనిజాలు ఇవన్నీ అధిక బరువును తగ్గించేవే. ప్రతీ రోజు గ్లాస్ నీటిలో 20% శాతం అలోవెరా గుజ్జును కలిపి తాగేయాలి. కడుపులోని కొవ్వు, చెడు పదార్థాలు, పేగులకు అంటుకుపోయే ఆయిల్ వంటివన్నీ మొత్తం క్లీన్ అయిపోతాయి. ఉత్తి జ్యూస్ తాగలేమనుకునేవారు అందులో కాస్త నిమ్మరసం, తేనె లాంటివి కలుపుకుంటే సరి.



**శ్రీమతి డి. ప్రమీల, డైరెక్టర్ - ఆత్మ, ఆంధ్ర ప్రదేశ్**

# సేంద్రియ నేలవు - వానపాముల ఎరువు



వానపాముల సహాయంతో తయారుచేసిన సేంద్రీయ ఎరువును వర్మీకంపోస్ట్ అంటాం. వర్మీకంపోస్ట్ అనేది వానపాముల విసర్జితం. వ్యర్థ పదార్థాలను వానపాములకు ఆహారంగా అందించి, వాటి విసర్జితాలను ఎరువులుగా వినియోగించుకొంటాము. వానపాముల చెత్త చెదారాన్ని ఇతర సేంద్రీయ పదార్థాలను తిని విసర్జించిన పదార్థాన్ని వర్మీ కంపోస్ట్ అంటాము.

**పోషక విలువలు :** వర్మీకంపోస్ట్ లో పైరు పెరుగుదలకు ఉపయోగపడే ఎన్నో సేంద్రీయ పదార్థాలు ఉన్నాయి. వర్మీ కంపోస్ట్‌లో మొక్కలకు కావలసిన అన్ని రకాల స్థూల, సూక్ష్మ పోషక పదార్థాలు, హార్మోనులు, విటమిన్లు, ఎంజైములు, లాభసాటైన ఉపయోగ కరమైన కోట్లాది బ్యాక్టీరియా ఇతర సూక్ష్మజీవులు ఉంటాయి. కర్బన, నత్రజని నిష్పత్తి 15:1 ఉంటుంది.

నత్రజని=1.00-2.00%, భాస్వరం=0.55-5.04%, పొటాషియం=0.67-1.75%, కాల్షియం=0.44-1.10%, మెగ్నీషియం=0.15-0.5%, సల్ఫర్=0.15%, రాగి=5PPM-110 PPM, మాంగనీసు=90 PPM-96 PPM%, జింకు=24 PPM-40 PPM, ఇనుము=175-110 PPM, మాలిబ్డినం= 0.2 PPM ఆర్గానిక్ కార్బన్ = 263.

కిలో వానపాములు రోజుకు 5 కిలోల చెత్తను కంపోస్ట్ గా మార్చగలవు. వానపాములు అవి తిన్న ఆహారం నుండి 5-10% వాటి శరీర పోషణకు ఉపయోగించుకొని, మిగిలిన దానిని విసర్జించుతాయి. ఈ విధంగా విసర్జించిన పదార్థాన్నే "వర్మీ కంపోస్ట్" అంటున్నాం.

**వానపాముల ఆహారం :** వానపాముల ఆహారం క్షారగుణం - ఆమ్లగుణం మధ్యస్థంగా (పి.హెచ్=7) వుండటం మంచిది. ఆహారంలో ఆమ్ల గుణం ఎక్కువగా ఉంటే వానపాములు చనిపోతాయి. భూసార పరీక్షా పరికరంతో గానీ, పి.హెచ్ మీటరుతో గానీ, లిట్మస్ పేపరుతోగానీ, బెడ్స్‌లోని ఆహారాన్ని అప్పుడప్పుడు పరీక్ష చేయాలి. ఆమ్ల గుణం ఎక్కువగా ఉన్నచో సున్నపు రాతి పొడిని (కాలియం కార్బోనేట్) నీళ్ళలో కలిపి బెడ్స్‌పై చల్లి ఆహారాన్ని పైకి క్రిందకూ కలపాలి. సున్నపురాయి పొడి ఎక్కువగా వాడిననూ వానపాములకు ప్రమాదం లేదు. 10 కిలోల ఆహారానికి 1 కేజీ సున్నపు రాయి పొడి వాడవచ్చును. బెడ్లోని ఆహారాన్ని పైకి క్రిందకూ కదపటం వలన, ఆహారంలోని క్షార గుణాన్ని తగ్గించటమే గాక, బెడ్ పై పెరిగే క్రిములను అరికట్టవచ్చును.

ఆహారంగా ఎండిన పశువుల పేడ, మాగిన కోళ్ళ ఎరువు, కూరగాయల వ్యర్థాలు, వంటశాలలోని వ్యర్థాలు, పశువుల మూత్రం, ఫిల్టర్ మట్టి, చెరకు పిప్పి, కోడిగ్రుడ్ల పెంకులు, చిత్తు కాగితాలు, మార్కెట్ యార్డ్ వ్యర్థాలు, అట్టపెట్టెలు, రంపం పొట్టు,కొబ్బరి ఆకులు, కొబ్బరి పీచు, వేరుశనగ ఆకులు, కలుపు గడ్డి వగైరాలను వానపాములకు ఆహారంగా వాడవచ్చును. వర్మీబెడ్స్ పచ్చిమేత వేయరాదు, ప్లాస్టిక్, గాజు, రబ్బర్, టిన్ మొదలైన పదార్థాలు బెడ్లో వేయరాదు . లిగ్నిన్ ఎక్కువగా ఉండే వరి గడ్డి, కొబ్బరి పీచు, తదితరాలను ముందుగా రాక్ ఫాస్ఫేటు లేదా సూపర్ ఫాస్ఫేటుతో కుళ్ళబెట్టి వర్మీ బెడ్స్ వాడాలి. వానపాములకు ఇచ్చే ఆహారంలో సి.యన్. రేషియో 20 కన్నా తక్కువ ఉండాలి.

**వానపాములు-తీసుకోవలసిన జాగ్రత్తలు :** తొట్టెల పై భాగంలో జల్లెడ రేకును పెట్టుట ద్వారా గాని, బట్టల సబ్బు నీరు తొట్టె గోడల లోపల అంచులకు రాయుట ద్వారా వానపాములను తొట్టెలు నుండి బయటకు పోకుండా చేయవచ్చును. బెడ్లలో ఎర్ర చీమలను నివారించుట కొరకు 20 లీటర్ల నీరు + 100గ్రా కారం (మిర్చిపొడి) + 100 గ్రా పసుపు పొడి + 100 గ్రా. ఉప్పు, కొద్దిగా సబ్బు పొడి కలిపి బెడ్ల చుట్టు, గోడలపైన, నేల మీద చల్లాలి. 5% వేపనూనె, వాడిన డీజల్ ఆయిల్, గ్రీజు కూడా వాడవచ్చును. బ్లీచింగ్ పౌడరును కూడా బెడ్స్ చుట్టు చల్లటం మంచిది. కిరోసిన్‌లో ముంచిన తాడును బెడ్ చుట్టు కట్టినచో చీమలు బెడ్ లోనికి ప్రవేశించకుండా ఆపవచ్చును. బెడ్లో వేడి $30^0$సి కన్నా పెరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకొనవలయును. వేడి ఎక్కువగా ఉన్నచో బెడ్డును తిరగతీసి గాలి బాగా తగిలేటట్లు చేసినీరు చల్లటం మంచిది. పక్షులు, గోరింకలు, కోళ్ళు, తొండలు,

ఎలుకలు, బల్లులు, పిల్లులు, కప్పలు, పాములు, ఉడుతలు, మొదలగు వాటి బారి నుండి కాపాడాలి. సూర్యరశ్మి వర్షం నుండి వానపాములను కాపాడటానికి పాకలు వేసుకొనవలెను.

వర్మీబెడ్‌లో తేమశాతం 25-35% మధ్య ఉంచటం మంచిది. తేమశాతం 40% మించినచో వర్మీ దిగుబడి తగ్గుతుంది. తయారుచేసిన కంపోస్ట్ 8-12% తేమతో నీడలో నిలువ చేసుకోవలెను.

తరచూ బెడ్డులలోని ఆహారాన్ని పి.హెచ్ మీటరుతో గాని లిట్మస్ పేపరుతో గాని పరీక్షించి ఆమ్లగుణం ఎక్కువగా ఉన్నచో సున్నపు రాతి పొడిని (కాల్షియం కార్బనేట్) చల్లి ఆమ్లగుణాన్ని తగ్గించాలి. సున్నపు రాతి పొడిని ఎక్కువగా చల్లినా వానపాములు పై ఎక్కువ ప్రభావం చూపదు. వానపాముల ఆహారంలో సున్నపు రాతి పొడిని 10% వరకు కలుపవచ్చును.

బెడ్ లోని ఆహారాన్ని తరచూ తిరగదీస్తూ ఉండాలి. ఇలా చెయ్యటం వలన బెడ్లలోని ఆహారం వదులుగా వుండి గాలి బాగా తగులుట వలన ఆమ్ల గుణం తగ్గుతుంది. దీని వలన ఆమ్ల గుణం సహాయంతో పెరిగే చెదపురుగుల అభివృద్ధిని అరికట్టవచ్చును.

**తయారు చేయుట :** వర్మీకంపోస్ట్ సిమ్మెంటు రింగులు, చెక్కపెట్టెలు, ప్లాస్టిక్, ట్రేలు మొదలగు వాటిలో కొద్ది మొత్తంలో తయారుచేయవచ్చును. నేలపై ప్లాస్టిక్ షీటు పరచి దానిపై వ్యర్థాలు పరిచి వర్మీకంపోస్ట్ తయారు చేయవచ్చును. వానపాములను ఎండా వానల నుండి కాపాడడానికి తాటాకు పాకలు లేక గుడిసెలు ఏర్పాటు చేసుకాని వర్మీకంపోస్ట్ తయారు చేసుకొనవచ్చును. పశు వుల పాకలో ఒక మూలన కూడా తయారు చేసుకొనవచ్చును.

వర్మీకంపోస్ట్ వ్యాపారసరళిలో ఎక్కువగా తయారుచేసి మార్కెట్లో రైతులకు అమ్మి లాభాలు ఆర్జించవచ్చును. వ్యాపార సరళిలో ఆలోచించేటప్పుడు సుమారుగా 15 x 55 అడుగుల కొలతతో తాటాకు పాకలు నిర్మించి దానిలో 5 అడుగుల వెడల్పు, 50 అడుగుల పొడవు, 15 అంగుళముల లోతు కొలతలతో ఒక్కొక్క పాకలోనూ రెండు బెడ్స్ నిర్మించుకోవాలి. రెండు బెడ్స్ మధ్య దూరం 3 అడుగులు వుండేటట్లు కట్టినచో పనివాళ్ళు బెడ్స్ మధ్య తేలికగా తిరగగలరు. షెడులో వేడి తగ్గించుట కొరకు షెడు చుట్టు మొక్కలు పెంచటం మంచిది. వర్షం నీరు వగైరాలు బెడ్స్‌నికి రాకుండా కాపాడటానికి బెడ్ అడుగు భాగం నేల కన్నా ఎత్తుగా తయారు చేయాలి.



బెడ్ అడుగు భాగములో చెదలుపట్టకుండా వుండటానికి వేప ఆకులు గాని, గానుగ ఆకులు గాని పరచాలి. దానిపై కొబ్బరి పీచు బాగా వున్న డొప్పలను 2 అంగుళముల మందంతో పేర్చాలి. ఈ విధంగా పేర్చిన కొబ్బరి డొప్పలను బెడ్డింగ్ మెటీరియల్‌గా కొంతకాలం ఉపయోగించుకొనవచ్చును.

అలా తయారు చేసిన బెడ్స్ చీకిన పశువుల పేడ / బయోగ్యాస్ స్లర్రీ/ ఫిల్టర్ మట్టి/ మార్కెట్ యార్డులోని వ్యర్థాలు/ ఎండిన ఆకులు/ గడ్డి వగైరాలలో మనకు దొరికిన వాటిని 9 నుండి 10 అంగుళాల ఎత్తు వరకూ బెడ్స్‌ని నింపాలి. ఈ పొర పై వీలుపడినచో పశు మూత్రం చల్లి 48 గంలు తరువాత బెడ్లు పూర్తిగా తడిచేవరకూ నీరు పోయాలి. అడుగున నీరు నిలువ వుండకుండా ఉండటానికి డ్రైనేజీ కన్నాలను నిర్మించి ఇంకనూ అవసరమైన ఇతర చర్యలు తీసుకోవాలి. తరువాత ప్రతీ బెడ్‌లోనూ 50,000 (ఒక చదరపు అడుగుకు 200 చొప్పున) వానపాములు వేయాలి. బెడ్‌లోని ఆహారాన్ని వానపాములు ఇష్టపడినచో వానపాములు పైన కనిపించకుండా బెడ్ లోనికి వెంటనే వెళ్ళిపోతాయి. బెడ్స్‌లోని ఆహారాన్ని ఇష్టపడకపోతే బెడ్స్ నుండి బయటకు పోవటానికి ప్రయత్నిస్తాయి. అలాంటి పరిస్థితిలో, బెడ్స్ లోని ఆహారాన్ని మార్చి, వానపాములు ఇష్టపడే ఆహారాన్ని వేయవలసి ఉంటుంది. బెడ్స్ లోని తేమ శాతాన్ని నిలుపుట కొరకు ప్రతీ రోజూ నీటితో తడుపుతూ వుండాలి. ఎండాకాలంలో రోజుకు 2 సార్లు తడపటం మంచిది. నీరు తగినంతగా మాత్రం చల్లాలి. నీరు పారించకూడదు.



డాక్టర్.యన్.కృష్ణ ప్రియ, అసిస్టెంట్ ప్రొఫెసర్ ,వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల, ఉటుకూరు, కడప

డాక్టర్. వి.చంద్రిక, ప్రిన్సిపాల్ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల, ఉటుకూరు, కడప

# వేసవి కూరగాయల సాగులో జాగ్రత్తలు

వేసవిలో ఉండే అధిక ఉష్ణోగ్రత, వాతావరణంలో ఉండే తక్కువ తేమ కూరగాయల సాగుకు ప్రతిబంధకము అవుతుంది. అధిగమించి రైతులు వేసవిలో కూరగాయలు సాగుచేసి అధిక లాభాలు పొందాలంటే, వేసవికి అనువైన కూరగాయలను, వాటిలో అధిక వేడిని తట్టుకుని దిగుబడినిచ్చే ప్రత్యేక రకాలను ఎన్నుకోవాలి. వేసవిలోని అధిక ఉష్ణోగ్రత, వడగాల్పుల వల్ల మొక్క పెరుగుదల తక్కువగా ఉంది. పూత, పిందె, దిగుబడులు తగ్గుతాయి. అందువల్ల రైతులు కొన్ని ప్రత్యేక యాజమాన్య పద్ధతులు చేపట్టి, ఉన్న కొద్ది నీటి వనరులను సక్రమంగా వినియోగించుకుని, కూరగాయల సాగుపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తే రైతులు అధిక లాభాలు పొందటమే కాకుండా వినియోగదారులకు సరసమైన ధరలకు కూరగాయలను అందించగలుగుతారు.

## రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు :

**రకాల ఎంపిక :** ప్రత్యేకించి వేసవి సాగుకు సూచించిన రకాలను, సంకర రకాలను ఎంపిక చేసుకోవాలి. అవి నీటి ఎద్దడిని, అధిక వేడిమిని తట్టుకొని మంచి దిగుబడులిస్తాయి.

**టొమాటో :** లర్కవికాస్, పూసాఎర్లీ డ్వార్ఫ్, మారుతమ్ రకాలను ఎంపిక చేసుకోవచ్చు. సంకర రకాల్లో, రష్మీ, నవీన్, అవినాష్-2 లను పండించవచ్చు.



**బెండ :** పర్బనీ క్రాంతి, అర్క అభయ్, అర్క అనామిక ఎంపిక చేసుకోవచ్చు. సంకర రకాలలో వర్ష, ప్రియ, సుప్రియ.

**వంగ :** భాగ్యమతి, శ్యామల, పూసా పర్పుల్ క్లస్టర్, గులాబి, హైబ్రిడ్‌లో గ్రీన్‌లాంగ్, హరిత, రవయ్య, ఉత్కర్షలను ఎంచుకోవచ్చు.

**సొర :** పూసా సమ్మర్ ప్రొలిఫిన్ లాంగ్, అర్కబహార్, హైబ్రిడ్‌లలో వరద్ కావేరి, స్వాతిలను ఎంచుకోవచ్చు.

**కాకర :** కోయంబత్తూర్ లాంగ్ గ్రీన్, అర్కహరిత, హైబ్రిడ్ రకాలలో ఎన్.ఎస్-431, 432, మహికో 10, 13లను ఎంచుకోవచ్చు.

**నారుమడి తయారి :** వేసవిలో నారుమడిని నీడలో పెంచాలి. రసం పీల్చే పురుగుల నివారణకు ఇమిడాక్లోప్రిడ్‌తో 5 గ్రా. కిలో విత్తనానికి విత్తనశుద్ధి చేయాలి. నారుమడి పైన నైలాన్ వలను ఏర్పాటుచేసి రసం పీల్చే పురుగులను, వైరస్ తెగుళ్ళను అడ్డుకోవచ్చు. మడులలో విత్తనాలను ఒకసారి మొత్తం కాకుండా రెండు, మూడు విడతలుగా విత్తుకోవడం మంచిది. ఈ విధంగా చేయడం వల్ల ఒకసారి పండించిన కూరగాయల పంట దెబ్బతిన్నా మరోసారి విత్తిన పంట నుండి లాభం పొందవచ్చు. పొలంలోని మొక్కలను నీడనిచ్చే విధంగా ఉత్తర, దక్షిణ దిశల్లో ఆముదం, మొక్కజొన్న పంటలను వేయాలి లేదా ఎండ తీవ్రతను తగ్గించడానికి వీలైతే రైతులు 35 శాతం షేడ్ నెట్‌లను ఏర్పాటు చేసుకుంటే మంచి దిగుబడులు సాధించవచ్చు.

**మొక్కల సాంద్రత :** వేసవిలో మొక్క పెరుగుదల తక్కువ ఉంటుంది. కాబట్టి మొక్కల సాంద్రత ఎక్కువ ఉండాలి. ఉదాహరణకు టమాటను వర్షాకాలంలో 60×45 సెం.మీ. దూరంలో నాటితే, వేసవిలో 10×30 సెం.మీ. ఎడంతో నాటాలి. బీరకాయలు అయితే 2×0.5 మీ. దూరంలో విత్తుకోవాలి. అదే బెండలో అయితే వర్షాకాలంలో పంటకు ఎకరాకు 4 కిలోల విత్తనాలు విత్తితే, వేసవిలో అయితే 6 కిలోల విత్తనాలు విత్తాలి.

**నీటి, ఎరువుల వాడకం :** ఎక్కువ మోతాదులో సేంద్రియ ఎరువులను, జీవన ఎరువులను వాడటం వలన భూమిలో ఎక్కువ తేమను నిలిపి ఉంచవచ్చు. అంతేకాక వివిధ రకాలైన సేంద్రియ, ప్లాస్టిక్ మల్చింగ్ వాడటం వలన కూడా తేమ మరియు పోషకాలను



సంరక్షించవచ్చు. కలుపును సమర్థవంతంగా నివారించవచ్చు. కొద్ది నీటితో ఎక్కువ విస్తీర్ణమును సాగు చేయటానికి తుంపర లేదా బిందు సేద్య పద్ధతులను వాడాలి. సాధారణ పద్ధతిలో నీటిని ఇచ్చుట కంటే ఎండ ఎక్కువగా ఉన్నప్పుడు సాయంత్రం వేళల్లో తుంపర ద్వారా నీటిని పిచికారి చేయడం వల్ల ఎండ తీవ్రతను తగ్గించవచ్చు.

రసాయన ఎరువులను ఎక్కువ మోతాదులో వేయరాదు. ముఖ్యముగా నత్రజని ఎరువులను తక్కువ మోతాదులలో ఎక్కువసార్లు వేయాలి. తప్పకుండా సూక్ష్మ పోషకాలను పంటకు అందించాలి. లేనట్లయిన పోషక లోపాల వలన పంట ఎదుగుదల మరియు దిగుబడులు తగ్గుతాయి. అన్ని సూక్ష్మ పోషకాలను పంటకు అందించడానికి ఫార్ములా 4 ను లీటరు నీటికి 2 గ్రా. కలిపి పంటపై పిచికారి చేయాలి.

## ముఖ్యమైన ఇతర యాజమాన్య పద్ధతులు

వేసవిలో అధిక ఉష్ణోగ్రతకు తీగజాతి కూరగాయల్లో మగపూలు ఎక్కువగా వస్తాయి. దీని నివారణకు గింజలు విత్తిన 15 రోజులకు పంట రెండు నుంచి నాలుగు ఆకుల దశల్లో 3-4 గ్రా. బోరాక్స్‌ను లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. టమాటాలో కాయ పగుళ్ళను నివారించడానికి సరైన నీటి యాజమాన్యముతో పాటు బోరాన్‌ను పిచికారి చేయాలి. నీటి ఎద్దడి తట్టుకోడానికి 20 గ్రా. యూరియా నీటిలో కలిపి పిచికారి చేయాలి. పంటకు వేసే ప్రతి కిలో యూరియా, అరకిలో పొటాష్‌ను వాడటం వలన నీటి ఎద్దడిని తగ్గించి, చీడపీడలు కూడా అరికడుతుంది. ప్రతి 10 కిలోల యూరియాను 1 కిలో వేపపిండి కలిపి మొక్కలకు అందించడం వల్ల ఎండవేడికి యూరియా త్వరగా ఆవిరి కాకుండా ఎక్కువ రోజులు మొక్కలకు అందుబాటులో ఉంటుంది. లేదా ప్రతి 25 కిలోల యూరియాకు ఒక లీటరు వేపనూనె కలిపి అరగంట ఆరబెట్టి పంటకు వేయాలి.

పూత, పిందె దశలో 1 మి.లీ. ప్లానోఫిక్స్ 4.5 లీటర్ల నీటికి కలిపి వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయడం వల్ల టామాట, వంగలో పూత, పిందె రాలకుండా ఉంటుంది. మిరపలో ట్రైకాంటినాల్ 2.5 మి.లీ. 10 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయడం వలన పూత, పిందె నిలుస్తుంది. ఆకుకూర పంటలలో దిగుబడి పెంచడానికి 2 శాతం యూరియా + 50 పి.పి.ఎం. జిబ్బరెల్లిక్ ఆమ్లమును కలిపి పిచికారి చేయాలి.

## పురుగులు, తెగుళ్ళ యాజమాన్యం

వేసవిలో పంటలలో వివిధ రసం పీల్చే పురుగుల ఉధృతి ఎక్కువగా ఉంటుంది. కనుక, ముఖ్యముగా టమాట, వంగ, మిరపలలో రసం పీల్చే పురుగుల యాజమాన్యానికి సమగ్ర పద్ధతులను అవలంబించాలి.

★ పొలంలో మరియు దగ్గరలో ఉన్న కలుపు మొక్కలను పెరికి నాశనము చేయాలి.

★ రసం పీల్చే పురుగుల నివారణకు పసుపు (తెల్లదోమకు) మరియు బులుగు రంగు (తామర పురుగుకు) జిగురు అట్టలు ఎకరానికి ఒకొక్కటి 20 చొప్పున పెట్టాలి.

★ మిరపలో తామర పురుగు నివారణకు రైతులు ఎక్కువగా పురుగు మందులు పిచికారీ చేయడం జరుగుతుంది. కొన్ని రకాల సింథటిక్ పైరిత్రాయిడ్స్ కూడా ఎక్కువగా వాడటం వలన పురుగులో గుడ్లు పెట్టి సామర్థ్యము పెరిగి పురుగు ఉధృతి ఒక్కసారిగా పెరుగుతుంది. కాబట్టి మిరపలో తామర పురుగు యాజమాన్యానికి సింథటిక్ పైరిత్రాయిడ్స్ మందులను వాడకూడదు. నారుమడిలో సెంటు మండికి 80 గ్రాముల 0.3 శాతం ఫిప్రోనిల్ 0.3 శాతం గుళికలు తగినంత తేమ ఉన్నపుడు వేయాలి. అవసరాన్ని బట్టి డైఫెన్ థయురాన్ 1.5 గ్రా. లేదా స్పైనిటోరామ్ 11.7 శాతం 1.0 మి.లీ. లేదా ఫిప్రోనిల్ 2.0 మి.లీ. లేదా సయాన్ ట్రానిలిప్రోల్ 11.26 శాతం 1.2 మి.లీ. లేదా స్పైనోసాడ్ 0.25 మి.లీ. లేదా థయాక్లోప్రిడ్ 21.7 శాతం 0.6 మి.లీ. లేదా ఎసిటామిప్రైడ్ 0.2 గ్రా. లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**డా. పి. సుధా జాకబ్,** సీనియర్ శాస్త్రవేత్త,
**డా. కె. ఝాన్సీ,** ప్రోగ్రాం కోఆర్డినేటర్,
కృషి విజ్ఞాన కేంద్రం, ఘంటశాల



# నానో యూరియాతో సుస్థిర వ్యవసాయం







వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రపంచ జనాభా, అనూహ్యమైన వాతావరణ మార్పులు, వ్యవసాయ ఉత్పాదకత తగ్గడం, అస్థిర శ్రామిక శక్తి పెరిగిన పట్టణీకరణ వంటి సమస్యలను పరిష్కరించడం ద్వారా మరింత ఆహారాన్ని ఉత్పత్తి చేయడానికి ఇరవై ఒకటవ శతాబ్దంలో వ్యవసాయం అనేక రకాల సవాళ్లను ఎదుర్కొంటోంది. సాంప్రదాయ ఎరువులు పోషకాల వినియోగ సామర్థ్యం చాలా తక్కువగా ఉంది. ముఖ్యంగా నత్రజనిలో సుమారు 40%-70%, ఫాస్ఫరస్ 80%-90%, మరియు 50%-90% భాస్వరం ఎరువులు పంటకు అందక పర్యావరణంలో కలిసిపోతున్నాయి. దీని వలన గణనీయమైన ఆర్థిక నష్టాలను చూడవలసి వస్తున్నది. ఈ సమస్యలు 2050 వ సంవత్సరం నాటికి ఇంకా తీవ్రతర మవుతాయి. అప్పటికి 900 కోట్ల ప్రపంచ జనాభాకు ఆహారం అందించాల్సి వస్తుంది. ఎల్లప్పుడూ తగ్గుతున్న వనరులు పెరుగుతున్న ప్రపంచ జనాభాతో ఉన్న ప్రపంచంలో ఆహారం, మేత ఫైబర్ వంటి వనరులకు వ్యవసాయం మరింత ముఖ్యమైనది. ఈ సమస్యను ఎదుర్కోవడానికి, వ్యవసాయ ఆధారిత దేశాలు మరింత అధునాతన సాంకేతిక పరిజ్ఞానాలు, శ్రమను ఆదా చేసే పద్ధతులను అవలంబించాలి.

నానోటెక్నాలజీ ఒక ఆశాజనక సాధనం ఖచ్చితమైన వ్యవసాయ పద్ధతులు కొత్త శకానికి ఊతమిచ్చే సామర్థ్యాన్ని కలిగి ఉంది. అందువల్ల ఈ సమస్యలకు పరిష్కారంగా ఆవిర్భవించవచ్చు. నానో టెక్నాలజీ వలన మారుతున్న వాతావరణ పరిస్థితుల లోను వ్యవసాయంలో పర్యావరణానికి హానికలుగ చేయకుండా అధిక దిగుబడులను సాధించేందుకు దోహదపడుతుంది.

ఇఫ్కో నానో యూరియా అనేది నానోటెక్నాలజీ ఆధారిత విప్లవాత్మక అగ్రి ఇన్‌పుట్. ఇది మొక్కలకు నత్రజనిని అందిస్తుంది. రైతులకు నానో యూరియా అనేది ఆధునిక వ్యవసాయం చేపట్టడానికి మరియు వాతావరణ మార్పులను అధిగమించడానికి ఒక స్థిరమైన ఎంపిక. నానో యూరియా ఎరువుగా మొక్క పోషక అవసరాలను తీర్చడంలో దోహదపడుతుంది. ఎందుకనగా దీని కణ పరిమాణం సుమారు 20-50 nm అంతకంటే ఎక్కువ ఉపరితల వైశాల్యం (1 మిమీ యూరియా ప్రిల్ కంటే 10,000 రెట్లు) కణాల సంఖ్య (1 మిమీ యూరియా ప్రిల్ కంటే 55,000 నత్రజని కణాలు) కారణంగా నానో యూరియా ఆకులపై పిచికారీ చేయడం వలన మొక్క మరింత ప్రభావవంతగా గ్రహిస్తుంది. అందువల్ల, నానో యూరియా పంటకు దాని లభ్యతను 80% కంటే ఎక్కువగా పెంచుతుంది, దీని ఫలితంగా అధిక పోషక వినియోగ సామర్థ్యం ఏర్పడుతుంది. దీనికి అదనంగా, పంట పొలాల నుండి ఆవిరి రూపంలో నేల నుంచి నీటిలో కరిగే పోషకాలను కోల్పోవడం వలన పెరిగే పర్యావరణ కాలుష్యం వాతావరణ మార్పులను తగ్గించడంలో నానో యూరియా సహాయపడు తుంది.





## ఉపయోగాలు

- ఆకులలో పత్రహరితం కిరణజన్య సంయోగక్రియ పెరగడం వేరు బయోమాస్ పెరగడం పిలకలు/కొమ్మలు సంఖ్య పెరగడం వల్ల అధిక దిగుబడులు లభిస్తాయి.
- సూక్ష్మ పరిమాణం మరియు ఎక్కువ ఉపరితల వైశాల్యం ఘనపరిమాణం నిష్పత్తి కారణంగా, ఇఫ్కో నానో యూరియా కణాలు మొక్కకు సులభంగా లభిస్తుంది.
- పెట్టుబడి ఖర్చులు తగ్గించడం, అధిక దిగుబడులు నాణ్యమైన ఉత్పత్తుల ద్వారా రైతుల ఆదాయం పెరగడానికి దోహదపడుతుంది.
- ఇఫ్కో నానో యూరియా ఉపయోగించిన పంటలు వినియోగానికి సురక్షితంగా ఉంటాయి. అలాగే పంటలో ప్రోటీన్ పోషకాల నాణ్యత మెరుగ్గా ఉంటుంది.
- పంట క్లిష్టమైన ఎదుగుదల దశల్లో ఇఫ్కో నానో యూరియా ఆకులపై పిచికారీ చేయడం వలన పంటకు అవసరమైన నత్రజనిని సమకూరుస్తుంది.
- ఇఫ్కో నానో యూరియా ఒక బాటిల్ (500 మిలీ) మెరుగైన వినియోగ సామర్థ్యం వలన కనీసం 1 బ్యాగు సంప్రదాయ యూరియాను భర్తీ చేయగలదు.
- వ్యవసాయంలో సుస్థిరత మరియు పర్యావరణ భద్రతను ఇఫ్కో నానో యూరియా వాడడం వలన సాధించవచ్చు.
- నానో యూరియా వాడడం వలన సాంప్రదాయ యూరియా ద్వారా జరిగే నష్టాలను అనగా పంట పొలాల నుండి ఆవిరి రూపంలోను నేల నుంచి నీటిలో కరిగే పోషకాలను కోల్పోవడం తగ్గిస్తుంది.
- సంప్రదాయ యూరియా బస్తా ఎరువులతో పోలిస్తే ఇఫ్కో నానో యూరియా తక్కువ పరిమాణంలో అవసరం అవుతుంది. రవాణా మరియు గోదాము ఖర్చు పరంగా ఇది గణనీయమైన ప్రభావాన్ని చూపుతుంది. యూరియా బస్తాలతో పోలిస్తే నానో యూరియా బాటిల్స్ ని రైతులు తేలికగా తీసుకెళ్లవచ్చు

**పిచికారీకి అనువైన పంటలు :** ఆహార ధాన్యాలు, పప్పుధాన్యాలు, కూరగాయలు, పండ్లు, పూల తోటలు, ఔషధ మొక్కలు మరియు ఇతర పంటలకు నానో యూరియాను పిచికారీ చేయవచ్చు.

**ఎంత మోతాదులో ఎప్పుడు వాడాలి :** ఒక లీటరు నీటిలో 2-4 మిలీ నానో యూరియా (4 N) ని కలిపి పంట క్రియాశీల దశల్లో ఆకులపై పిచికారీ చేయాలి.

**మొదటి పిచికారీ:** మొలకెత్తిన 30-35 రోజుల తరువాత లేదా నాటిన 20-25 రోజుల తరువాత. రెండో పిచికారీ: మొదటి పిచికారీ చేసిన 20-25 రోజులు తరువాత లేదా పంట పూతదశకు ముందు

**గమనిక :** దుక్కిలో నత్రజనిని అందించే డిఏపి లేదా సంక్లిష్ట ఎరువులను వేయడం ఆపకూడదు. పంట, దాని కాలవ్యవధి మొత్తం నత్రజని అవసరమును బట్టి పిచికారీల సంఖ్యను పెంచవచ్చు లేదా తగ్గించవచ్చు.






**శ్రీమతి డా. డి.వి సుజాత, యస్.వి. అగ్రికల్చర్ వ్యవసాయ కళాశాల, తిరుపతి. ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, గుంటూరు.**



కొనుగోలు : ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలిస్తున్న నెల్లూరు జిల్లా జాయింట్ కలెక్టరు



చర్చ : శ్రీకాకుళం జిల్లా వ్యవసాయ సలహా మండలి



కత్తెర పురుగు నివారణ పద్ధతులు





పంపిణీ : క్లస్టర్ స్థాయిలో సబ్సిడీ విత్తనం



యంత్రసేవ ఎంతో ప్రయోజనం : విజయనగరం జిల్లాలో..



వ్యవసాయ శాఖ కమీషనరేట్ అధికార్ల పరిశీలన




ప్రశంస – ఆర్బీకే సేవలపై నాబార్డ్ ఛైర్మన్ జి.ఆర్. చింతల కితాబు



గుర్తింపు : విజయనగరం జిల్లా దుప్పాడ ఆర్బీకేకు ఐ.ఎస్.ఓ. ధృవీకరణ



అవగాహన : నర్సరీ పెంపకంపై రైతులతో చర్చాగోష్ఠి



సూచన : కందిపై తెగుళ్ళ నివారణకు శాస్త్రవేత్తల పరిశీలన



సందర్శన : నర్సరీని సందర్శించిన రైతులు




శిక్షణ: కృష్ణా జిల్లాలో మామిడి తోటల యాజమాన్యంపై అవగాహన

# కార్శీ చెరకు తోటలతో అధిక నికర ఆదాయం

అక్టోబర్ నుంచి ఏప్రిల్ వరకు చెరకు కొట్టి చక్కెర కర్మాగారాలకు తరలించడం అదేవిధంగా జనవరి నుంచి ఏప్రిల్ వరకు. బెల్లం తయారుచేయడం మన ఆంధ్రప్రదేశ్‌లో సర్వసాధారణం. అయితే చెరకు పంటలో మొక్క తోట కొట్టిన తరువాత ఆ మోళ్ళ నుంచి మరొక పంట వస్తుంది. దానినే కార్శితోట అంటారు. కాని చాలా ప్రాంతాల్లో రైతులు ఈ కార్శి తోటను బోనస్ పంటగా భావిస్తూ వాటి సాగులో అలక్ష్యం వహించడం గమనిస్తున్నాం. సరైన యాజమాన్య పద్ధతులు పాటించినట్లయితే ఈ కార్శీ తోటల ద్వారానే అధిక నికరాదాయం పొందవచ్చు. కార్శీతోటల సాగులో ప్రధమ కృషి, బోదెలు వేయడం, విత్తన ఖర్చు మరియు నాటడానికి సంబంధించిన ఖర్చు ఉండదు. కాబట్టి ఎకరాకు 20 నుండి 25 వేల రూపాయలకు పైగా కలిసి వస్తుంది. అంతేకాకుండా కార్శి తోటలు త్వరగా పక్వానికి వచ్చి సీజన్‌లో ముందుగా నరకడం వల్ల కూలీలకు అయ్యే ఖర్చును కూడా కొంత వరకు తగ్గించుకోవచ్చు.

అయితే మొక్క తోటలకు సమానంగా కార్శితోటల నుంచి దిగుబడులు పొందాలంటే దిగువ సూచించిన మేలైన యాజమాన్య పద్ధతులు పాటించవలసి ఉంటుంది. ఈ సూచనలన్నీ రైతులకు చాలావరకు తెలిసినవే ఉంటాయి. కాని వాటిని అమలు పరచడంలో శ్రద్ధ వహించరు. ఇవన్నీ రైతులు తమ పరిధిలో చేసుకొనే విధంగా ఉంటాయి. కాబట్టి తగిన ఆసక్తితో ఆయా యాజమాన్య పద్ధతులు పాటించినట్లయితే అధిక దిగుబడి నికరాదాయం పొందవచ్చును.

- చెరకు సాగుకు ఎన్నుకొనే రకం మొక్కతోటకు సమానంగా దిగుబడిని ఇచ్చే విధంగా ఉండాలి.



- ఆరోగ్యవంతంగా పెంచిన మొక్క తోటనుంచి మాత్రమే మంచి కార్శీ దిగుబడులు పొందే వీలుంటుంది.
- నిర్ణీత కాల పరిమితి పూర్తి అయిన తర్వాత పూర్తి పక్వదశకు చేరిన పిదప మాత్రమే తోటలను నరకాలి.
- చెరకు నరికేటపుడు మొక్క తోటల చెరకును భూమట్టానికి లేదా ఒక ఇంచు భూమి లోపలికి నరకాలి.
- చెరకు నరికిన తర్వాత చెరకును పొలం నుంచి తీసిన తర్వాత భూమట్టానికి లేదా కత్తులతో చెరకు వరుసలోని దుబ్బులను భూమట్టానికి చెక్కాలి. భూమి లోపల కణుపుల నుంచి వచ్చిన మొలకలు దుబ్బుల వేరు వ్యవస్థతో దగ్గర సంబంధం ఉండటం వలన బాగా ఎదుగుతాయి. భూమి పైకి నరకబడిన చెరకు దుబ్బుల నుంచి వచ్చిన మొక్కలు వేరువ్యవస్థతో సరైన సంబంధం లేకపోవడం వలన నీరు, పోషకాలు సరిగా సరఫరా కాక ఎండి చనిపోతాయి. ఒక వేళ ఎదిగినా కొంతకాలం తరువాత ఎండిపోవడానికి ఆస్కారం ఉంది. తద్వారా కార్శీ దిగుబడులు గణనీయంగా తగ్గుతాయి. కాబట్టి చెరకు దుబ్బులను తప్పనిసరిగా భూమట్టానికి లేదా ఒక ఇంచు లోపలకు నరికించే విషయంలో రైతులు దగ్గరుండి శ్రద్ధ వహించాలి.
- చెరకు వరుసల మధ్య ఆరు అంగుళాల లోతు దుక్కి చేయడం ద్వారా నేల గుల్లబారి చెరకు దుబ్బుల వేర్లకు ప్రాణవాయువు సరిపడా సరఫరా అవడం వలన కొత్త వేర్లు తొడిగి నీరు, పోషక పదార్థాలు అవసరమైన మేరకు గ్రహించి మొలకలు బాగా రావడం వలన చెరకు ఎదుగుదలకు అనువుగా ఉంటుంది.
- మొక్కతోట నరకటానికి ఒక నెల ముందే అదే రకానికి చెందిన ఒంటికన్ను ముచ్చెలను పాలిథీన్ సంచులలో లేదా చిన్న చిన్న ట్రేలలో లేదా పొలంలో ఒక ప్రక్క నారుమళ్ళలో పెంచి 40 – 45 రోజుల మొలకలను కార్శీతోటలోని వరుసలలో ఉన్న ఖాళీలలో నింపి అవసరమైన నీటిని, పోషక పదార్థాలను అందించి అవి నిలదొక్కుకొనే వరకు సంరక్షించు కోవాలి.
- వరుసల మధ్య దుక్కిచేసి ఖాళీలను నింపి ఎకరానికి సిఫారసు చేసిన ఎరువులను అనగా 135 కేజీల నత్రజని, 45 కేజీల



భాస్వరం, 45 కేజీల పొటాషియం ఎరువులను చెరకు దుబ్బుల మొదళ్ళ దగ్గర చిన్న గోతులు తీసి అందులో వేసి మట్టితో కప్పాలి.

- సిఫారసు చేసిన మోతాదులో సగభాగం నత్రజని, మొత్తం భాస్వరం మరియు మొత్తం పొటాషియం అందించే ఎరువులను మోళ్ళు చెక్కి ఖాళీలను నింపిన వెంటనే వేయాలి. మిగిలిన సగభాగం నత్రజనిని కార్శిచేసిన 45 రోజులకు దుబ్బుల మొదళ్ళ దగ్గర గోతుల్లో వేసి మట్టితోకప్పాలి.
- ఆ తరువాత 1.25 టన్నుల చెరకు చెత్తను చెరకు వరసల మధ్య పలుచగా కప్పడం ద్వారా భూమిలోని తేమ ఆరిపోకుండా కొంత వరకు కాపాడటంతో పాటు కలుపు మొక్కలు మరియు పీక పురుగు తాకిడి చాలా వరకు అరికట్టవచ్చు.
- అంతేగాకుండా 45 రోజుల తరువాత పైపాటుగా చెరకు వరుసల మధ్య దుక్కిచేసేటప్పుడు చెరకు చెత్త భూమిలో కలిసి సేంద్రియ పదార్థం భూమికి చేరుతుంది. అయితే చెద పురుగులను అరికట్టడానికి చెరకు చెత్త కప్పేముందు ఎకరాకు 10 కిలోల మిథైల్ పారాథియాన్ పొడిమందు చెరకు వరుసల మధ్యచల్లుకోవాలి.
- కార్శి తోటల్లో సాధారణంగా కనిపించే ఇనుము ధాతులోప నివారణకు (ఆకులన్నీ మొదట పసుపు వర్ణానికి పిదప తెలుపు రంగుకి మారటం) 10 లీటర్ల నీటికి 200 గ్రాముల అన్నభేది మరియు ఒక మామూలు సైజు నిమ్మకాయలో ఒక బద్ద నుండి వచ్చే రసం కలిపి పైరుపై పిచికారి చేయాలి. అవసరాన్ని బట్టివారం వ్యవధితో రెండుమూడు సార్లు పిచికారి చెయ్యడం ద్వారా ఇనుపధాతు లోపాన్ని సమర్ధవంతంగా సరిచేసుకోవచ్చు.
- ఇక వేసవిలో కార్శి తోటలను ఎక్కువగా ఆశించే పీకపురుగు నివారణకు అవకాశం వున్నచోట్ల దగ్గర దగ్గరగా తడులు ఇవ్వటం. పీకపురుగు సోకిన మొవ్వులను ఏరి కాల్చి వేయడంతో పాటు ట్రైకోగ్రామా ఖిలోనిస్" గ్రుడ్డు పరాన్న జీవిని ఎకరాకు 20,000 చొప్పున కార్శి చేసిన 30 రోజుల నుండి 10 రోజుల వ్యవధితో నాలుగుసార్లు విడుదల చెయ్యాలి. పరాన్నజీవుల గ్రుడ్లు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానం, అనకాపల్లిలో ట్రైకోకార్డుల రూపంలో రైతాంగానికి అందుబాటులో ఉన్నాయి. అదేవిధంగా క్లోరిపైరిఫాస్ అనే మందును 2.5 మి.లీ. ఒక లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేసినచో పీక పురుగు ఉధృతిని తగ్గించవచ్చు.
- పొలుసు పురుగు నివారణకు చెరకు గడల మొదలు భాగంలో గల ఎండిన, పండిన ఆకులను తెంచి లీటరు నీటికి 1.7 మి.లీ. డైమిథోయేట్ కలిపిన మందు ద్రావణాన్ని గడలు బాగా తడిసేటట్లు పిచికారి చెయ్యాలి. అయితే ఈ ఆకులు తెంచే టప్పుడు చెరకు గడ మొవ్వు నుండి క్రిందికి బాగా విప్పారిన ఆకు పచ్చటి ఎనిమిది ఆకులు వుండేటట్లు జాగ్రత్త వహించి మిగిలిన క్రింది ఆకులను మాత్రమే రెలవాలి.
- కార్శి తోటలను బాగా ఆశించే "కాటుక తెగులు" నివారణకు లీటరు నీటికి 1 మి.లీ. "ప్రాపికొనజోల్" మందును కలిపి కార్శి చేసిన 30-35 రోజులకు ఒకసారి, 60 రోజులకు ఒకసారి పైరు బాగా తడిసేటట్లు పిచికారి చేయాలి.
- మురుగు నీరుపోయే సౌకర్యం తక్కువగా వున్న పొలంలో అనాసకుళ్ళు తెగులు ఆశించే అవకాశం ఉంది. దాని నివారణకు 1 గ్రా॥ కార్బండిజమ్ 1 లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.
- మంచి కార్శి దిగుబడుల నివ్వగల రకాన్ని ఎంచుకొని. ఆరోగ్యవంతంగా పెంచుకున్న మొక్క తోటల నుండి సిఫారసు చేసిన యాజమాన్య పద్ధతుల్ని పాటిస్తూ పరిశుభ్రమైన సాగు పద్ధతుల్ని ఆచరించినట్లయితే మూడు కార్శిల వరకు మొక్క తోటతో సమానమైన దిగుబడులు పొందవచ్చు.

---

**డా॥ బి. వజంత, డా॥ టి.యం. హేమలత, శ్రీ కె.ఆర్. ఠాగూర్, డా॥యం. హేమంత్ కుమార్, వ్యవసాయ పరిశోధనా స్థానం, పెరుమాళ్ళపల్లి**

# ఉల్లిలో సమగ్ర పంట యాజమాన్యం




ఉల్లి సాగులో కొన్ని లోటుపాట్లు వాతావరణంలో వ్యత్యాసం వల్ల దిగుబడులు గణనీయంగా తగ్గిపోయి, రైతులు నష్టపోతున్నారు. ఉల్లిసాగులో పాటించవలసిన సమగ్ర పంట యాజమాన్య పద్ధతుల గురించి క్లుప్తంగా తెలుసుకుందాం.

**వాతావరణం :** ఉల్లి పంట మంచును తట్టుకోలేదు. ఉల్లి పంట తొలి దశల్లో (శాఖీయ దశ) పెరుగుదలకు తక్కువ ఉష్ణోగ్రతలు గడ్డ ఊరే దశలో కొద్దిగా ఎక్కువ ఉష్ణోగ్రతలు మరియు కోత సమయంలో వెచ్చని వాతావరణం పంటకు అనుకూలం. గడ్డ ఊరే దశలో ఎక్కువ ఉష్ణోగ్రతలు ఉంటే, పంట కోతకు ముందే రావడం జరుగుతుంది, దీనివలన దిగుబడులు తగ్గుతాయి. వాతావరణంలో వ్యత్యాసం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో దిగుబడులు బాగా తగ్గిపోతాయి.

**నేలలు :** మురుగునీటి వసతి గల సారవంతమైన ఎర్ర నేలలు మరియు ఎక్కువ సేంద్రీయ పదార్థం కలిగిన ఇసుక నేలలు ఉల్లిసాగుకు మిక్కిలి అనుకూలం. కాని, బరువైన నేలల్లో గడ్డ ఆకృతి కోల్పోయే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఉప్పు, చౌడు, క్షారత్వం మరియు నీరు నిలువ ఉండే నేలలు ఉల్లి సాగుకు పనికిరావు.

ఉల్లి పంటను ఖరీఫ్ కాలంలో జూన్, జులై మాసాల్లోను, రబీ పంటగా అక్టోబరు, నవంబరు మాసాల్లోను మరియు వేసవి పంటగా జనవరి, ఫిబ్రవరి మాసాలలో విత్తుకోవచ్చు. ఖరీఫ్ కాలంలో జులై 15 తర్వాత, రబీలో డిశంబర్ 15 తర్వాత, వేసవిలో ఫిబ్రవరి 15 తర్వాత నాటుకుంటే దిగుబడులు తగ్గిపోతాయి.

**రకాలు : ఎరుపు రంగు రకాలు :**

- **బళ్ళారి రెడ్ :** పాయలు పెద్దగా ఉండి, పాయలు ఒకటిగా గాని, రెండుగా కలిపి గాని ఉంటాయి. ఘాటు తక్కువగా ఉంటుంది. మన రాష్ట్రంలో అన్ని ప్రాంతాలలో సాగు చేయుటకు అనువైనది. దిగుబడి 60-70 క్వి/ఎకరాకు.
- **నాసిక్ రెడ్ :** పాయలు మధ్యస్థంగా గుండ్రంగా ఉండి ఎరుపు రంగులో ఘాటుగా ఉంటాయి. దిగుబడి 100-120 క్వి/ఎకరాకు. ఖరీఫ్ మరియు రబీ పంటలకు అనువైనది.
- **అగ్రిఫౌండ్ డార్క్ రెడ్ :** పాయలు ముదురు ఎరుపు రంగులో గుండ్రంగా ఘాటుగా ఉంటాయి. ఎక్కువ రోజులు నిలువ చేయవచ్చు. ఖరీఫ్ లో నాటుటకు అనువైనది. దిగుబడి 100-120 క్వి/ఎకరాకు.
- **పూసా రెడ్ :** పాయలు ఎరుపు రంగులో మధ్యస్థంగా ఉంటాయి. తక్కువ ఘాటుతో నిలువ నాణ్యత ఎక్కువ. దిగుబడి 100-120 క్వి/ఎకరాకు.
- **అర్క నికేతన్ :** పాయలు ఎరుపు రంగుతో 100-180 గ్రా. బరువు ఉంటాయి. నిలువ నాణ్యత మరియు ఘాటు ఎక్కువ. దిగుబడి 132 క్వి/ఎకరాకు. ఖరీఫ్ మరియు రబీ పంటలకు అనువైనది.
- **అర్క కళ్యాణ్ :** పాయల బరువు 100-190 గ్రా. దిగుబడి 136 క్వి/ఎకరాకు. ఆకుమచ్చ తెగులును కొద్దిగా తట్టుకొంటుంది. ఖరీఫ్ కు అనువైనది.
- **అర్క ప్రగతి :** 120 రోజులలో కోతకు వచ్చే గుండ్రని, ఎరుపు రకం. ఖరీఫ్, రబీ పంటలకు అనువైనది. దిగుబడి 130 క్వి/ఎకరాకు.





- **కళ్యాణ్ పూర్ రెడ్ రౌండ్ :** ఎరుపు రకం. 130-150 రోజులలో కోతకు వచ్చి ఎకరాకు 100-120 క్వి. దిగుబడి నిస్తుంది.
- **ఎన్-53 :** పాయలు మధ్యస్థ గుండ్రంగా ముదురు ఎరుపు రంగులో ఉంటాయి. 140 రోజులలో కోతకు వస్తుంది. ఖరీఫ్ పంటకు అనువైనది. దిగుబడి 100-120 క్వి/ఎకరాకు. ఖరీఫ్ కు అనువైనది.
- **అగ్రిఫౌండ్ లైట్ రెడ్ :** పాయలు చిన్నవిగా, గట్టిగా, గులాబీ రంగులో ఘాటుగా ఉంటాయి. నారు పోయకుండా విత్తనం నేరుగా విత్తుకోవచ్చు. ఎక్కువ రోజులు నిల్వయుండి, రవాణాకు తట్టుకుంటుంది. ఎగుమతులకు అనువుగా ఉంటుంది. రబీకు అనువైనది.

**పసుపు రకాలు :** ఎర్లి గ్రానో, అర్క పితాంబర్ - తక్కువ ఘాటు, సలాడ్ మరియు ఎగుమతి, 150-160 క్వ/ఎకరాకు.

**తెలుపు రకాలు :** పూసా వైట్ రౌండ్, పూసా వైట్ ఫ్లాట్ - డీహైడ్రేషన్కు అనువైనవి.

**సంకర రకాలు :** అర్క కీర్తిమాన్, అర్క లాలిమ మరియు అర్క భీమ్. దిగుబడి 180-200 క్వి/ఎకరాకు. ఖరీఫ్ మరియు రబీ పంటలకు అనువైనది. ప్రాంతము మరియు మార్కెట్ ననుసరించి రకాలను ఎంపిక చేసుకోవాలి.

**నారు పెంచడం :** నేలను బాగా దున్ని, 120 సెం. మీ. వెడల్పు, 3 మీ. పొడవు గల ఎత్తైన నారుమళ్లను తయారు చేసుకోవాలి. 2 - 2.5 కిలోల విత్తనాన్ని 200 -250 చ. మీ.ల నారుమడిలో పెంచిననారు, ఒక ఎకరాలో నాటడానికి సరిపోతుంది. విత్తన శుద్ధి తప్పకుండా చేసుకోవాలి (5 మి.లీ. ఇమిడాక్లోప్రిడ్ 600 FS కిలో విత్తనానికి). నారుమడిలో విత్తనాన్ని పలుచగా వరుసల్లో పోయాలి. నారుకుళ్లు తెగులు సోకకుండా 10 రోజులకొకసారి కాపర్ ఆక్సిక్లోరైడ్ 3 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. నారు పెరుగుదల దశలో రసం పీల్చే పురుగు ఆశించకుండా కార్బోఫ్యురాన్ 3 జి గుళికలు నారుమడిలో చల్లి నీరు కట్టాలి

**నారు నాటడం :** 2 - 3 సార్లు దుక్కిదున్ని పొలాన్ని చదును చేయాలి. బోదెలు 30 సెం. మీ. ఎడంలో చేసి బోదెకు రెండు వైపులా నాటుకోవాలి. నారును 1 శాతం బోర్డో మిశ్రమంలో ముంచి నాటడం వల్ల నారుకుళ్లు సోకకుండా ఉంటుంది. నారును 20 మి. లీ. మలాథియాన్ 10 గ్రా. కార్బెండిజిమ్ 20 లీ. నీటిలో కలిపిన ద్రావణంలో 20 నిముషాలు ముంచి నాటితే చీడపీడల బాధ చాలా వరకు తగ్గించవచ్చు. తయారైన నారుమడిని అనగా ఖరీఫ్ పంటకు 6-7 వారాల నారు, రబీ పంటకు 7-8 వారాల నారును ప్రధాన పొలంలో నాటుకోవాలి. ఎత్తైన మడులలో సాగు చేయడం వల్ల చీడపీడల బెడద తగ్గి దిగుబడి పెరుగుతుంది.

**కలుపు నివారణ, అంతర కృషి :** నాటిన 48 గంటల లోపు, పెండిమిథాలిన్ 30 % ఎకరాకు 1.3 లీటర్లను 200 లీటర్ల నీటితో కలిపి పిచికారీ చేసుకోవాలి. నాటిన 20 రోజుల తరువాత, ఆక్సిఫ్లోరిఫెన్ 23.5 % ఎకరాకు 200 మి. లీ. లేదా క్విజాలోఫాప్ ఇథైల్ ఎకరాకు 400 మి.లీ., 200 లీటర్ల నీటితో కలిపి పిచికారీ చేసుకోవాలి. నాటిన 30 - 40 రోజుల మధ్యలో మరలా కలుపు తీసి, మట్టిని ఎగదోయాలి.



నారు నాటిన 75 రోజుల తర్వాత మాలిక్ హైడ్రజైడ్ 0.25 శాతం (2.5 గ్రా/లీ. నీటికి) ద్రావణాన్ని చల్లడం వల్ల ఉల్లిగడ్డ మొలకెత్తడం వలన కలిగే నష్టం బాగా తగ్గుతుంది. నారు నాటిన 100 - 110 రోజులకి 1 గ్రా. కార్బెండిజిమ్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేస్తే నిలువలో ఉల్లికుళ్ళటం చాలావరకు తగ్గుతుంది.



**డా. ఎన్. రమేష్ నాయక్**
**శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం,**
**బనవాసి, కర్నూలు**

# మామిడిలో మేలైన దిగుబడికి సూచనలు



మామిడి పంటను చాలా మంది రైతులు ముఖ్యమైన ఉద్యాన వాణిజ్య పంటగా సాగుచేస్తున్నారు. పండ్లతోటలలో మామిడి పంట చాలా ప్రముఖమైనది. అందుకే దీనిని పండ్లలో రారాజు అని పిలుస్తారు. మన భారతదేశంలో చాలా రకాల మామిడి వంగడాలు/రకాలు వివిధ ప్రాంతాలలో సాగవుతున్నాయి. కొన్ని వందల సంవత్సరాల నుండి ఈ పంటను సాగుచేస్తున్నారు. ప్రపంచంలోనే మామిడిని పండించడంలో మన భారత దేశం ప్రథమ స్థానంలో ఉంది. ప్రపంచం మొత్తంలో సగం వరకు మామిడి ఉత్పత్తి మన భారత దేశంలో జరుగుతోంది. మామిడి పండులో అధిక పోషకాలు, విటమిన్-ఎ, సి, అలాగే మంచి రుచి ఉండడం వలన చాలా మంది ప్రజలు ఈ పండును ఇష్టపడతారు. అలాగే మామిడిలో కొన్ని ఔషధ గుణాలు కూడా ఉన్నాయి. మామిడిని మన రాష్ట్రంలో ప్రధానంగా కృష్ణా, విజయనగరం, పశ్చిమ గోదావరి, తూర్పుగోదావరి, శ్రీకాకుళం, విశాఖపట్నం, చిత్తూరు, కడప జిల్లాల్లో సాగుచేస్తున్నారు. మామిడిని పండించడానికి అన్ని రకాల నేలలు అనుకూలంగా ఉంటాయి. కానీ లోతైన నేలల్లో వేర్లు బాగా వ్యాపించి, చెట్టు అభివృద్ధి చెంది చాలా కాలం ఫలాలనిస్తాయి.

ఇతర ఉద్యాన పంటలలో లాగానే, మామిడిని కూడా చాలా రకాల పురుగులు మరియు తెగుళ్ళు ఆశించి నష్టాన్ని కలిగిస్తాయి. పురుగులు లో ప్రధానమైనవి తేనెమంచు పురుగు, టెంక పురుగులు, పండు ఈగ, పిండిపురుగులు. తెగుళ్ళలో ప్రధానమైనవి బూడిద తెగులు, మచ్చ తెగులు, బాక్టీరియా నల్ల మచ్చ తెగులు, మామిడి తొడిమ కుళ్ళు వంటి తెగులు కాయ నాణ్యత తగ్గి మార్కెట్ లో సరైన ధర లభించక నష్టం వాటిల్లుతుంది. కావున పురుగులు మరియు తెగుళ్ళ లక్షణాలను మొదటి దశలలోనే గుర్తించి వాటి నివారణ చర్యలను చేపట్టినట్లయితే పురుగులు మరియు తెగుళ్ళు వల్ల కలిగే పంట నష్టాన్ని సమర్థవంతంగా నివారించవచ్చును. కాయ నాణ్యత బాగుంటే మార్కెట్ లో ధర కూడా అధికంగా ఉంటుంది.

**కాయతొలుచు పురుగు :** ఈ పురుగు ఉధృతి చిన్న కాయ దశ నుండి పెద్ద కాయ దశ వరకు ఉంటుంది. కాయ ముక్కు భాగములో నల్లటి రంధ్రముతో ఎండిన మామిడికాయ/పిందెల గుత్తులు చెట్టుకు వ్రేలాడుట ప్రధానమైన లక్షణము. గోలీ సైజు కాయ దశలో ఒక్కొక్క గొంగళి పురుగు, ఒకటి కన్నా ఎక్కువ కాయలకు నష్టము కలగజేయును. సాధారణముగా ఒక్కొక్క మామిడి కాయనందు 4-6 గొంగళి పురుగులు ఉండును. చిన్న సైజు కాయలున్నపుడు, పురుగులు ఒక కాయ నుండి మరొక కాయకు మారి ఎక్కువ నష్టము కలిగించును. జనవరి, ఫిబ్రవరి మాసాల్లో తల్లి రెక్కల పురుగులు బయటకి వచ్చి పంటపై ఆశిస్తాయి.

**యాజమాన్యం :**

- మామిడి పంట పూర్తి అయిన తరువాత ఎండుకొమ్మలను తీసివేసి నాశనం చేయాలి.
- మామిడి పంటకాలము పూర్తయిన తరువాత ఎండు కొమ్మల/ కాండము పగుళ్ళలో గల స్థబ్ద స్థితిలో ఉన్న గొంగళి పురుగులను నాశనం చేయాలి.
- మెత్తని ఎండు పుల్లలను కొమ్మ చుట్టూ గుత్తలుగా కట్టి నిద్రావస్థకు చేరిన గొంగళి పురుగులను ఒకేసారి నాశనం చేయవచ్చు.
- క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లీటరు నీటికి కలిపి 15రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.
- వేపగింజల కషాయం 5% లేదా వేపనూనె 1% (లీటరు నీటికి 10 మి.లీ.) పిచికారీ చేసి ఈ పురుగులను అదుపులోకి తెచ్చుకోవచ్చు. డెల్టామెత్రిన్ 2.8 ఇసి 1 మి.లీ. లీటరు నీటికి కలిపి గోలీ సైజుకాయ దశలో రెండు వారాల కొకసారి పిచికారీ చేయాలి.





**తామర పురుగులు :** మామిడి పూత, కాయల నుండి రసాన్ని పీల్చి నష్టం కలుగజేసే పురుగుల్లో ముఖ్యమైనవి ఈ తామర పురుగులు. ఇవి 2 మి.మీ. పొడవుండి, కొత్త చిగురు వచ్చే దశలో ఆకుల పై అసంఖ్యాకంగా చేరి గోకి రసాన్ని పీల్చి వేస్తాయి. దీని వలన లేత /చిగురు ఆకులు చిన్నవిగా ఉండి ఆ తరువాత రాలిపోతాయి. ఈ పురుగులు పుష్పగుచ్ఛాలపై, పిందెల పై చర్మం గీకి రసం పీల్చడం వల్ల వక్క రంగులో చర్మం బీటలు వారి రాతి మంగు ఏర్పడి, కాయ నాణ్యత పడిపోతుంది.

**నివారణ :** ఈ పురుగు నివారణకు పిఫ్రోనిల్ 2 మి.లీ. లేదా ఎసిఫేట్ 1.5గ్రా. లేదా డైమిథోయేట్ 2.0 మి.లీ. లీటరు నీటికి కలిపి నల్ల పూత దశలో అనగా పిందెలు ఎదిగే దశలో పిచికారీ చేయాలి.

**పిండి పురుగు :**

మామిడి పిందె లేదా కాయల పై, కాడలపై తెల్లని పిండి వంటి పదార్థపు కవచం కలిగిన చిన్న పురుగులు ఆశించి తీవ్రమైన నష్టం కలుగజేస్తాయి. ఈ దూదిలాంటి కవచాల క్రింద ఉండే పురుగులు గుంపులు గుంపులుగా చేరి పిందె/కాయల నుంచి రసాన్ని పీలుస్తాయి. భూమిలో గ్రుడ్లు పెడతాయి. వీటి నుంచి వచ్చిన పిల్ల పురుగులు మొక్క కాండం పైకి ఎగబాకి మొక్క ఇతర భాగాలను చేరి సమూహాలుగా పెరుగుతాయి.

తల్లి పురుగులు పిందె/కాయల నుంచి, వాటి కాడల నుంచి రసం పీల్చడం వల్ల వాటి పెరుగుదల తగ్గిపోవడం లేదా కాయ రాలిపోవడం జరుగుతుంది. ఇది వదిలే జిగట పదార్థం వల్ల కూడా పిందె, కాయల పై మసి తెగులు వ్యాపిస్తుంది. ఈ పురుగు ఎక్కువగా ఆకులు, కొమ్మలు, పూత కాడల సందుల్లో ఆశించి నష్టపరుస్తుంది. వీటి తీవ్రత ఫిబ్రవరి–మార్చి నెలల్లో అధికంగా ఉంటుంది. ఇవి ఎక్కువగా ఆశిస్తే కాయలు సరిగా ఎదగక రాలిపోతాయి.

**యాజమాన్యం :**

- తొలకరిలో చెట్టు మొదలు దాకా దగ్గరగా దున్నాలి లేదా పాదులను త్రవ్వి తిరగేయాలి.
- చెట్టుకి మీటరు ఎత్తులో పాలిథీన్ షీట్స్ కట్టడం, గ్రీజు పూయడం ద్వారా పురుగులు చెట్టు పైకి పాకకుండా నివారించవచ్చు.
- వేసవిలో చెట్ల క్రింద తవ్వి మట్టిని వెలికితీయాలి. 1.5 గ్రా. ఎసిఫేట్ లేదా 2 మి.లీ. క్వినాల్ ఫాస్ లీటరు నీటికి కలిపి చెట్ల భాగాలను బాగా తడిచేలా పిచికారీ చేయాలి.
- కార్బోసల్ఫాన్ 2 మి.లీ./లీ. లేదా డైమిథోయేట్ 2 మి.లీ./లీ. నీటికి పిల్ల పురుగులను నాశనం చేయడానికి వాడవచ్చును.

**టెంక పురుగులు :** ఈ పురుగు ముఖ్యంగా నీలం, తోతాపురి రకాల్ని ఆశించి, ఎక్కువ నష్టాన్ని కలుగ జేస్తుంది. తల్లి పెంకు పురుగులు మామిడి కాయలు గోళీ కాయ సైజులో ఉన్నప్పుడు కాయల మీద గ్రుడ్లు పెడతాయి. గ్రుడ్ల నుంచి వెలువడిన పిల్ల పురుగులు కాయలోనికి తొలుచుకొనిపోయి టెంకను చేరతాయి.



టెంకలోని గింజను తిని పెరిగి కోశస్థ దశను కూడా అక్కడే పూర్తి చేసుకొని కాయకు రంధ్రం చేసి బయటకు వస్తుంది.

**యాజమాన్యం :**

- ఎసిఫేట్ 1గ్రా. లీటరు నీటికి కలిపి పిందె ఏర్పడిన తర్వాత ఒకసారి, నెల తర్వాత మరోసారి పిచికారీ చేయాలి.
- ఇందువల్ల గ్రుడ్లు, వాటి నుండి వచ్చే పిల్లలు చనిపోతాయి.
- డైమిథోయేట్ 2 మి.లీ. కాయ గోళీ పరిమాణంలో ఉన్నప్పుడు 15 రోజులు వ్యవధిలో పిచికారీ చేయాలి.



డా. కె. నీలిమ, డా. టి.స్వామి చైతన్య, డా. పి. నాగిరెడ్డి, డా. ఎ. వీరయ్య, కె.వి.కె ఊటుకూరు

# వేసవిలో అరటి తోటల యాజమాన్యం



వేసవి ఉష్ణోగ్రతలు $45^0$ సెల్సియస్‌కు మించి, వడగాలులు కూడా వీచినప్పుడు అన్ని రకాల అరటి తోటలు ఎక్కువ శాతం నష్టానికి గురవుతాయి. వేసవి తీవ్రతకు పచ్చ అరటి (గ్రాండ్ నైన్) త్వరగా నష్టానికి గురవుతుంది. పొట్టి పచ్చ అరటి(వామనకేళి), కర్పూర చక్కెర కేళి, కె.బి.యస్-8 అధిక ఉష్ణోగ్రతలను కొంత వరకు తట్టుకోగలవు. వేసవి కాలంలో తేలిక నేలల్లో ప్రతి 2 రోజులకు, బరువు నేలల్లో ప్రతి 4 రోజులకు నీటి తడులు ఇచ్చినట్లయితే వేడిని చాలా రోజుల వరకు తట్టుకోగలవు. అధిక ఉష్ణోగ్రతల తాకిడికి ముందుగా లేత ఆకులు తరువాత ముదురు ఆకులు ఎండిపోతాయి. లేత గెలలు నల్లగా మాడిపోతాయి. కోసిన గెలలోని కాయలు త్వరగా పండు బారతాయి. పండ్లు ఉడికించినట్లుగా మెత్తబడి నీరుకారి సాధారణ రుచి, నిల్వ సామర్థ్యాలను కోల్పోతాయి. వేసవికి దెబ్బతిన్న గెలలు అమ్మకానికి పనికిరావు.

## తోట వయసును బట్టి వేసవిలో కలిగే నష్టం - యాజమాన్య పద్ధతులు

వేసవిలో నాలుగు మాసాలలోపు తోటల ఆకులు పూర్తిగా ఎండిపోతాయి. తడులు 3 రోజుల కొకసారి అందించలేని పరిస్థితుల్లో కాండం మరియు దుంప కూడ ఎండి, కుళ్ళి పోతుంది. ఎండలు తగ్గిన తరువాత చెట్లు చిగురించి మాములు ఎదుగుదలకు ప్రతి 3 లేక 4 రోజుల కొక సారి నీటి తడి తప్పని సరిగా ఇవ్వాలి. ఎరువులను తక్కువ మోతాదులో దగ్గర దగ్గరగా ఎక్కువ సార్లు అందివ్వాలి, ఒకటి లేక రెండు మాసాల వయసు గల తోటల్లో ఎక్కువ శాతం మొక్కలు చనిపోతే, వాటిని దున్ని మరల జూన్, జులై నెలల్లో నాటుకోవాలి.

వేసవిలో ఐదు మాసాల పైబడిన తోటల ఆకులు ఎండిపోతాయి. దుంపకు మరియు కాండానికి తక్కువ నష్టం కలుగుతుంది. ఈ వయస్సు తోటలు తేలికగా తేరుకుంటాయి. గెలవేయటానికి గల సమయం తక్కువగా ఉన్నందున చిన్న గెలలు వేస్తాయి. పెద్ద గెలలు వేసినా సరిగా పక్వానికి రావు. ఇటువంటి తోటలకు ప్రతి 3 లేక 4 రోజులకు తప్పని సరిగా తడి ఇవ్వాలి. ఎరువులను సిఫార్సు చేసిన మోతాదు కన్నా 50 శాతం అదనంగా ఇవ్వాలి. గెలవేసే సమయంలో గెలలో పండ్లు ఎదుగుదల ఆధారంగా లీటరు నీటికి 5.0 గ్రా పొటాషియం నైట్రేట్ లేదా సల్ఫేట్ ఆఫ్ పొటాష్ లను మార్చి మార్చి జిగురుతో కలిపి వారం రోజుల వ్యవధి తో నాలుగు సార్లు ఆకులు, గెలలు పూర్తిగా తడిసే విధంగా పిచికారి చేయాలి.



గెలలు వేస్తున్న, గెలలు వేయటానికి సిద్ధంగా ఉన్న మరియు లేత గెలల (సగంలోపు తయారైన)తో ఉన్న తోటల్లో తీవ్రమైన ఎండ మరియు వడగాలులకు ఆకులు పూర్తిగా మాడి, ఎండి పోతాయి. అరటి గెలలు సరిగా తయారు కాక ఎండ వేడిమికి చనిపోతాయి. పచ్చ అరటి రకాల్లో గెలలు కూడ జారిపడతాయి. ఈ దశలో ఉన్న తోటలకు జరిగే నష్టం ఎక్కువ. తగిన సమయం లేనందున నష్టాన్ని పూరించటానికి అవకాశం లేదు. ఇటు వంటి తోటలకు నీటి తడులు దగ్గర దగ్గరగా పెట్టాలి. తొండంతో సహా గెల మొత్తానికి ఎండు ఆకు చుట్టి ఎండ నుండి రక్షణ కల్పించాలి. ఎండలు తగ్గాక మొక్కకు 5 నుండి 6 ఆరోగ్య వంత మైన ఆకులు నిలిచి ఉన్నప్పుడు మాత్రమే



అమ్ము కొనగలిగే గెలలు తయారవుతాయి. లీటరు నీటికి 5.0 గ్రా పొటాషియం నైట్రేట్ లేదా సల్ఫేట్ ఆఫ్ పొటాష్ లను మార్చి మార్చి జిగురుతో కలిపి వారం రోజుల వ్యవధితో నాలుగు సార్లు ఆకులు, గెలలు పూర్తిగా తడిసే విధంగా పిచికారీ చేసి జరిగిన నష్టాన్ని కొంత వరకు తగ్గించవచ్చు. చెట్ల ఆకులు పూర్తిగా మాడిన తోటల్లో ఆరోగ్యంగా ఉన్న పిలకలను కార్శి తోటగా పెంచటం మంచిది.

వేసవిలో గెలలు సగం లేక ఆపైన తయారైన దశలో ఉన్న తోటల ఆకులు మరియు గెలలు ఎండిపోతాయి. చెట్లు విరిగిపడిపోతాయి. గెలలు కోసిన తర్వాత త్వరగా పండి, రుచి తగ్గి, నిల్వసామర్థ్యం కోల్పోతుంది. ఇటువంటి గెలల్లోని కాయలు



ఉడికించినట్లుగా ఉండడంతో మార్కెట్లో మంచి ధర రాదు. ఇటువంటి చెట్ల గెలలకు ఎండు ఆకు చుట్టి ఎండ నుండి రక్షించాలి. పక్వానికి వచ్చిన గెలలను ఉదయం పూట చల్లని వాతావరణంలో మాత్రమే కోసి నీడ ఉన్న (ఎండ మరియు వేడిగాలులు తగలని) ప్రదేశంలో ఉంచాలి.

## ముందు జాగ్రత్త చర్యలు:

2-3 నెలలు వయసున్న సూది పిలకలను ఫిబ్రవరి - మార్చి నెలల్లో నాటుకొని అరటి తోటలకు నష్టాన్ని కొంత వరకు తగ్గించుకోవచ్చు. అవిశె లాంటి త్వరగా పెరిగే పైరును తోట చుట్టూ 3-4 వరుసల్లో అరటితో పాటు నాటు కుంటే వేడి గాలులను అడ్డుకుంటాయి. అరటి తోటను సిఫార్సు చేసిన సాంద్రతలోనే నాటుకుని తోటలోని మొక్కలన్నీ బ్రతికి ఉండే విధంగా జాగ్రత్త పడాలి. నేల స్వభావం మరియు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వేసవి కాలంలో తడులివ్వాలి. తేలిక నేలల్లో రెండు నుండి మూడు రోజులకు మరియు బరువైన నేలల్లో నాలుగు నుండి ఐదు రోజులకు నీరు పెట్టాలి. మార్చి నెల నుండి 10 నుండి 15 రోజుల కొకసారి పొటాషియం సల్ఫేటు (0.5 శాతం) మందు ద్రావణాన్ని, జిగురు మందుతో కలిపి పైరు పూర్తిగా తడిసే విధంగా పిచికారి చేసిన ఎడల, అరటికి వేసవి ఉష్ణోగ్రతలను తట్టుకొనే శక్తి కలుగుతుంది.



డా. టి.స్వామి చైతన్య, డా. పి. నాగిరెడ్డి,
కె. నీలిమ, డా. ఎ. వీరయ్య,
కే.వి.కే ఊటుకూరు

# నేల విడిచి వ్యవసాయం – హైడ్రోపోనిక్స్




ప్రపంచ వ్యాప్తంగా సాగు భూమి క్రమంగా క్షీణిస్తుంది. ఎడారి ప్రాంతాలు విస్తరిస్తున్నాయి. నగరాలు, పట్టణాలు పెరగడం, భూసారం తగ్గడం వంటి అనేక కారణాల ఫలితంగా పెరుగుతున్న జనాభా ఆహార అవసరాలను తీర్చడానికి సాగుభూమితో ప్రమేయం లేకుండా ప్రత్యామ్నాయ పద్ధతుల్లో సేద్యాన్ని చేయడాన్ని ప్రోత్సహించవలసిన ఆవశ్యకత ఏర్పడింది.

సాధారణంగా భూమిలో ఎకరాకు 3,500 టమోటా మొక్కల్ని పెంచేవారు. భూమితో ప్రమేయం లేకుండా సేద్యం చేసే పద్ధతుల్లో అదే విస్తీర్ణంలో 10,000 నుండి 12,000 వరకు మొక్కల్ని పెంచి లాభాలు ఆర్జిస్తున్నారు. మామూలు భూమిలో ఒకే పంట వరుసగా సాగుచేస్తే భూసారం దెబ్బతింటుంది కనుక రొటేషన్ పద్ధతిలో వివిధ రకాల పంటల్ని, పండించాల్సి ఉంటుంది. భూమి అవసరం లేకుండా సేద్యం చేసేవారికి ఈ బాధలు ఉండవు. తమకు నచ్చిన పంటను ఏడాది పొడవునా సీజన్లతో ప్రమేయం లేకుండా పండించుకోవచ్చు.

## హైడ్రోపోనిక్స్ చరిత్రకు సాక్షయం హ్యాంగింగ్ గార్డెన్స్ :

వాస్తవానికి భూమి సాయం లేకుండా సేద్యం చేసే పద్ధతులు పురాతన కాలమునుంచే అమలులో ఉన్నాయి. ఈ ప్రక్రియకు పిరమిడ్స్‌కు ఉన్నంత చరిత్ర ఉంది. సాగుభూమి లేకుండా మొక్కల్ని పెంచడాన్ని "హైడ్రోపోనిక్స్" అంటారు. వ్యవసాయపరంగా మాత్రం హైడ్రోపోనిక్స్ తోటలు పురాతన బాబిలోన్ నగరంలో వృద్ధి చెందింది. అక్కడి హ్యాంగింగ్ గార్డెన్స్ ఇందుకో ఉదాహరణ మాత్రమే. ప్రపంచంలోని ఏడు వింతలలో అదొకటన్నది విదితమే.

మన దేశానికి హైడ్రోపోనిక్స్ పద్ధతులు 1946 వరకు రాలేదు. విదేశాలలో రూపుదిద్దుకున్న పద్ధతులు మనకు పనికిరావని ఇక్కడ పరిస్థితులకు అనువైన ప్రక్రియను 1947లో రూపొందించారు. డార్జిలింగ్‌లోని కాలింపాగ్ ఎక్స్‌పెరిమెంటల్ ఫామ్ ఈ ఘనకార్యాన్ని సాధించింది. అతి చౌకగా రూపొందించ బడిన ఈ ప్రక్రియకు బెంగాల్ సిస్టమ్ ఆఫ్ హైడ్రోపోనిక్స్ (Bengal System of Hydroponics) అన్ని పేరు స్థిరీకరించారు.

## హైడ్రోపోనిక్స్ పద్ధతులు :

హైడ్రోపోనిక్స్‌లో ఏడెనిమిది పద్ధతులు ప్రచారంలో ఉన్నా, వాణిజ్యపరంగా మాత్రం డ్రిప్, న్యూట్రియంట్ ఫిల్మ్ టెక్నిక్ – ఎన్.ఎఫ్.టి. (Nutrient Film Technique) N.F.T. ప్రక్రియలు లాభసాటిగా ఉన్నాయి. డ్రిప్ పద్ధతిలో. పెర్‌లైట్ (Perlite) లేదా రాఊ మీడియంలో మొక్కల్ని ఉంచి వాటి వేర్లకు పోషకాలు గల ద్రావకాన్ని అందిస్తారు. ఎన్.ఎఫ్.టి. పద్ధతిలో మొక్కల వేర్లు ఒకే ఛానల్‌లో ఉంటాయి. వాటిని తాకుతూ కింది నుంచి పోషక ద్రావణం వెళుతూ ఉంటుంది. నీరు నిలవ ఉండదు. డ్రిప్ పద్ధతిలో టొమాటో, మిరప, వంగ, కూర మిరప, కీరదోస, స్ట్రాబెర్రీ, మొదలగునవి పెంచుతున్నారు. ఎన్.ఎఫ్.టి. పద్ధతిలో ఆకుకూరలు, ఔషధ మొక్కలు వంటి తక్కువ కాలంలో పండే పంటల్ని సాగు చేస్తున్నారు. ఈ పద్ధతిలో సాగైన ఆకుకూరలు పరిశుభ్రముగా ఉంటాయి. వాటిని కడగాల్సిన పనిలేదు.

ఈ పద్ధతిని ఎక్కువగా హరిత గృహములలో (Green houses) పంటలు పండించడానికి ఉపయోగిస్తున్నారు. ప్రపంచ హైడ్రోపోనిక్స్ ఉత్పత్తి విస్తీర్ణము 1980లో 15,000 ఎకరాల నుండి 2001లో 62,500 ఎకరాలకు విస్తరించింది. ఇప్పుడు లక్షల ఎకరాలలో సాగు చేస్తున్నారు. మనదేశంలో ఇప్పుడిప్పుడే ప్రాచుర్యము పొందుతుంది. ఆకుకూరలు, కూరగాయలు మరియు పూలను ఈ సాంకేతిక పరిజ్ఞానము ఉపయోగించి వాతావరణ నియంత్రణ పరిస్థితులలో (Controlled Environment Conditions) పండిస్తున్నారు. కొన్ని ప్రాంతములలో హరిత గృహములలో కాకుండా బయట (Open Field) పండిస్తున్నారు.



మొక్కల పెరుగుదలకు ఎక్కువ పరిమాణములో కావలసిన పోషకాలను స్థూల పోషకాలు అంటారు. అవి C,H,O, N,P, s,K, C, Mg తక్కువ పరిమాణములో కావలసిన వాటిని సూక్ష్మ పోషకాలు అంటారు. అవి Fe, Cl, Mn, B, Zn, Cu మరియు Mo.

కొన్ని పోషకాలు అవసరం కానప్పటికి వాటిని మొక్కలు గ్రమించి వాటి పెరుగుదలకు అవసరమైన జీవన చర్యలలో ఉపయోగించుకొంటాయి. అవి సిలికాన్ (Si), నికెల్ (Ni), అల్యూమినియం (Al), కోబాల్ట్ (Co), వెనీడియం (V), సెరీనియం (Se) మరియు ప్లాటినమ్ (Pt).

PH : ఆమ్లము మరియు క్షార గుణమును తెలిపే సూచిక ఆమ్లత్వము లేదా క్షారత్వమును కొలవడానికి pH (పి. హెచ్.) విలువను / స్కేలును ఉపయోగిస్తారు. pH విలువ 7.0 కంటే తక్కువ ఎక్కువగా ఉంటే క్షారత్వము (Alkalinity) మరియు 7.0 ఉంటే తటస్థము (Neutral) గా పరిగణిస్తారు. మొక్కలు తమకు కావలసినవి అన్ని పోషకాలను, కావలసిన స్థాయిలో గ్రహించడానికి pH వాంఛనీయ స్థాయి (Optimum Range) 6.3 – 6.5 ఉంటుంది.

మొక్కలు కావలసిన వివిధ పోషకాలు అనగా స్థూల మరియు సూక్ష్మ పోషకాలు కావలసిన పరిమాణంలో తీసుకొనుటలో pH చాల ముఖ్య పాత్ర వహిస్తుంది. pH పరిధి తగ్గినా, హెచ్చినా పోషకాలు గ్రహించడంలో చాల వ్యత్యాసము వస్తుంది.

EC (Electrical Conductivity) : మొక్కలకు అందించే పోషక ద్రావణము (Nutrient Solution) గాఢత చాల ముఖ్యము. EC తక్కువగా ఉంటే మొక్కలకు పోషకాల లభ్యత తక్కువగా ఉంటుంది. EC ఎక్కువగా ఉంటే పోషకాలు మరియు నీటిని తీసుకోవడంలో చాలా మార్పు వస్తుంది. EC తక్కువగా ఉన్నప్పుడు గాఢ పోషక ద్రావణం కలపాలి. EC ఎక్కువగా ఉన్నప్పుడు నీటిని కలపాలి.



గాఢ ద్రావణమును గాని, నీటిని గాని కలిపేటప్పుడు EC పరీక్ష చేస్తూ కలపాలి. EC ఎక్కువగా ఉంటే మొక్కలు వడలిపోతాయి.

కనుక $p^H$ మరియు EC ని మొదటి నుండి చివరి వరకు జాగ్రత్తగా పర్యవేక్షిస్తూ సరిచేసుకోవాలి. pH మరియు EC లను రోజూ గమనిస్తూ ఉండాలి. ఎందుకంటే హైడ్రోపోనిక్స్‌లో pH మరియు EC స్థాయిలు తరచూ మారుతుంటాయి. అసలైన హైడ్రోపోనిక్స్ (True Hydroponics) విషయానికి వస్తే న్యూట్రియన్ ఫిల్మ్ టెక్నిక్ (Nutrian Film Technique) చాల ముఖ్యమైనది. దీనిని అలెన్ కూపర్ (Allen Cooper) అనే శాస్త్రవేత్త ప్రప్రథమంగా స్థిరీకరించారు. దీనిలో ఏవిధమైన మధ్యస్థ జడ పదార్థము లేకుండా ప్రవహిస్తున్న పోషక ద్రావణం నుండి నీరు, పోషకాలు మరియు ప్రాణవాయువువు ఆక్సిజన్ $CO_2$l ను మొక్కల వేళ్ళు గ్రహిస్తాయి. చురుకుగా (active) ఉన్న వేర్లు తెలుపు రంగులో ఉంటాయి. ఆక్సిజన్ సరైన స్థాయిలో అందకపోతే గోధుమ రంగు (Brown Colour) కు మారతాయి. ఈ స్థితిలో వేర్లు నీటిని, పోషకాలను తీసుకోవడంలో మందగిస్తుంది. pH మరీ ఎక్కువగా ఉన్నప్పుడు కూడా వేర్లు ఈ విధంగా గోధుమ రంగుకు మారతాయి.

## నిలువ ద్రావణములు – పోషక ద్రావణములు

నిలువ ద్రావణము (Stock Soluction) 'A' తయారు చేయడానికి 4.5 లీటర్లు నీటిలో కలుపవలసిన స్వచ్ఛమైన పోషక రసాయన పదార్థములు (గ్రాములలో)

కాల్షియం నైట్రేటు (1003), EDTA ఐరన్ (79)

నిలువ ద్రావణము (Stock Soluction) 'B' తయారు చేయడానికి 4.5 లీటర్లు నీటిలో కలుపవలసిన స్వచ్ఛమైన పోషక రసాయన పదార్థములు (గ్రాములలో)

పొటాషియం డై హైడ్రోజన్ ఫాస్ఫేటు (263), పొటాషియం నైట్రేటు (583), మెగ్నీషియం సల్ఫేటు (513), మాంగనీసు సల్ఫేటు (6.1), బోరిక్ యాసిడ్ (1.7), కాపర్ సల్ఫేటు (0.39), అమ్మోనియం మాలిబ్డేట్ (0.37), జింకు సల్ఫేట్ (0.44)

ఈ నిలువ పోషక ద్రావణములు అధిక గాఢత కలిగి ఉంటాయి. కనుక నేరుగా మొక్కల పోషణకు ఎట్టి పరిస్థితులలో వాడకూడదు. వాడితే మొక్కలు చనిపోతాయి.

పైన తెలిపిన రెండు నిలువ ద్రావణములను ('ఎ' మరియు 'బి') లను 1000 లీటర్లు నీటిలో కలిపి పలుచన (Dilute) చేయాలి. ఇప్పుడు ఈ పలుచని పోషక ద్రావణము (Diluted

Nutrient Solution) ను హైడ్రోపోనిక్స్ పద్ధతిలో మొక్కల పెంపకమునకు వాడవచ్చును. ఈ విధముగా పలుచన చేసిన పోషక ద్రావణమును వాడేముందు దానియొక్క pH ని సరిచేయాలి. pH ను కావలసిన పరిధి Optionum Range) అనగా 6.3 – 6.5 మధ్య ఉండేలా 10 శాతము నత్రికామ్లమును చాలా కొంచెం కలుపుతూ సరిచేసుకోవాలి.

సాధారణంగా నత్రికామ్లము ($HNO_3$) గాఢ రూపంలో మార్కెట్‌లో దొరుకుతుంది. ఈ గాఢ నత్రికామ్లమును నీటిలో కలిపి పలుచన చేయాలి. అనగా ఒక లీటరు నీటిలో 100 మి.లీ. గాఢ నత్రికామ్లమును కలిపితే 10 శాతం నత్రికామ్లము తయారవుతుంది.

**ముఖ్యగమనిక :** 10 శాతం నత్రికామ్లమును తయారు చేసేటప్పుడు ఎట్టి పరిస్థితులలో గాఢ నత్రికామ్లములో నీరు కలుపకూడదు. నీటిలో గాఢ నత్రికామ్లము (Concentrated Nitric Acid) ను కలపాలి.

pH ను సరిచేసేటప్పుడు పొరపాటున ఎక్కువ 10 శాతం నత్రికామ్లము ఎక్కువ కలిపినప్పుడు, ఉండవలసిన స్థాయి కన్నా తక్కువకు పడిపోయినప్పుడు pH ను పైకి పెంచవలసిన అవసరముంది. దీనికిగాను 10% పొటాషియం హైడ్రాక్సైడ్ (KOH) ను వాడవలెను.

హైడ్రోపోనిక్స్‌లో రెండు పద్ధతులు ఉన్నాయి : **1) తెరచిన (Open) పద్ధతి :** ఈ పద్ధతిలో పోషక ద్రావణమును నిర్ణీత కాలము తరువాత (7–10 రోజులు) బయటకు పంపించి, తాజా ద్రావణాన్ని మొక్కలకు అందిస్తారు. **2) మూసిన (Closed) పద్ధతి:** ఈ పద్ధతిలో పోషక ద్రావణమును బయటకు పంపించకుండా ఒక తొట్టి (Tank) లో సేకరిస్తారు. ఈ విధంగా సేకరించిన ద్రావణాన్ని పరీక్ష చేసి, గాఢత (EC), pH ని వాంఛనీయ పరిధి వరకు సరిచేస్తారు. ఈ విధముగా సరిచేసిన ద్రావణాన్ని పంపు (Pump) ద్వారా మొక్కలకు అందిస్తారు.

వ్యాపార సరళిలో నిర్వహించబడే హైడ్రోపోనిక్స్ యూనిట్లలో సెన్సార్లు మరియు కంప్యూటర్లు సహాయంతో EC మరియు pH తో పాటు గాఢతను నియంత్రిస్తారు.

pH, EC లను కొలవడానికి మార్కెట్‌లో డిజిటల్ pH మరియు EC మీటర్లు అందుబాటులో ఉన్నాయి.

విత్తనములు నాటుట మరియు నారు మొక్కల పెంపకము: నాణ్యమైన అధిక మొలక శాతం గల విత్తనాలను ఎన్నుకోవాలి.



ఈ విత్తనములను పెర్లైట్ (Perlite) లేదా కోకోపీట్ (cocopeat) లేదా సగం పెర్లయిట్ మరియు సగము కోకోపీట్ మిశ్రమము నింపిన కప్పులలో నాటుకోవాలి. నారు మొక్కలు తయారైన తరువాత వాటిని కప్పులతో సహా హైడ్రోపోనిక్స్ బెడ్స్‌లో గాని, తొట్టెల్లో గాని, ఛానల్స్‌లోకి గాని మార్చాలి.

## హైడ్రోపోనిక్స్ వలన లాభములు :

అధిక ఉత్పాదకత మరియు ఆరోగ్యవంతమైన ఉత్పత్తులు. సాంప్రదాయ పద్ధతిలో ఉపయోగించే నీళ్ళలో 20–30 నీళ్ళు సరిపోతాయి. కలుపు సమస్య ఉండదు కనుక హానికరమైన రసాయనాలను ఉపయోగించవలసిన అవసరం లేదు. ఉత్పత్తులు అధిక పోషక విలువలు కలిగి ఉండి నిల్వకాలము ఎక్కువ. మొక్కలు సమతుల పోషకాలు సులభంగా అందే పరిస్థితులలో పెరుగుతాయి కాబట్టి, సహజ రోగనిరోధక శక్తిని కలిగి ఉండుట వలన చీడపీడతల ఉధృతి తక్కువ. ఈ పద్ధతిలో సాగు పరిస్థితులు చాలా పరిశుభ్రము (hygienic) గా ఉంటాయి. మంచి యాజమాన్య పద్ధతులు ఆచరించి పండించే హైడ్రోపోనిక్స్ ఉత్పత్తులు, ఒక్కొక్కసారి సేంద్రీయ ఉత్పత్తుల కన్నా నాణ్యతలో మిన్నగా ఉంటాయి. జీవ నియంత్రణ పద్ధతులలో సస్యరక్షణ చేయవచ్చు. ఈ పద్ధతిలో సంవత్సరము పొడవునా పండించ వచ్చును. పంట పెరుగుదలను అనగా శాఖీయ పెరుగుదల (Vegetative growth) మరియు పునరుత్పత్తి పెరుగుదల (Reproductive growth) ను Crop Steering ద్వారా నియంత్రించవచ్చు. పనిచేసే ప్రదేశము పరిశుభ్రము (hygienic) గా ఉంటుంది.



**జె. వెంకటరావు,**
సహాయ వ్యవసాయ సంచాలకులు,
వ్యవసాయ కమీషనర్ కార్యాలయం,
ఆంధ్రప్రదేశ్, గుంటూరు

# ఉద్దానం స్కందఫలం.. ఉత్తరాదికి వరం



పనస ఒక పండ్లచెట్టు. మల్బరీ కుటుంబానికి చెందిన చెట్టు. తూర్పు ఆసియా దీని జన్మస్థలం. ప్రపంచంలోనే అతి పెద్ద పండును ఇచ్చే చెట్టు ఇదే. దాదాపు గరిష్ఠం ఒక్కొక్కటి 36 కేజీలుంటుంది. 70 సె.మీ పొడవు, 40 సెం.మీ. వ్యాసం కలిగి ఉంటాయి. పండ్లు మానవుడికి ప్రకృతి ప్రసాదించిన అపురూపమైన వరం.

ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఖజ్జా, బురద అనే రెండు రకాల పనసను పండిస్తారు. దీనిలో చిన్న చిన్న తొనలుంటాయి. అవి చాలా తియ్యగా, పీచుగా ఉంటాయి. అవి మృదువుగా ఉండడం వల్ల అందులోని తొనలను ఒలవడానికి చాకును తప్పకుండా ఉపయోగించాలి. పనసపండును 11 నుండి 13 డిగ్రీల ఉష్ణోగ్రత వద్ద ఉంచితే 3 నుండి 6 వారాల వరకు ఉంటాయి. పచ్చి వాటిని ముక్కలుగా కోసి బాగా ఎండబెడతారు. వాటిని డబ్బాలో వేసుకుని సంవత్సరమంతా ఉపయోగించుకుంటారు.

వాతావరణాన్ని బట్టి ఒక్కో ప్రాంతంలో ఒక్కో సమయంలో పక్వానికి వస్తాయి. కొన్ని చోట్ల మార్చి నుండి జూన్ మధ్యలో, మరికొన్నిచోట్ల ఏప్రియల్ నుండి సెప్టెంబర్ మధ్యలో, ఇంకొన్ని చోట్ల జూన్ నుండి ఆగష్టు మధ్యలో అవి కాస్తాయి. పనస పై తొక్క భాగాన్ని చిన్నచిన్న ముక్కలుగా కోసి కూర చేస్తారు. దీన్ని పనసపొట్టు కూర అనికూడా అంటారు. దీన్ని ఇంగ్లీషులో జాక్ ఫ్రూట్ అంటారు.

ప్రతి సంవత్సరం ఒక్క విశాఖపట్నం జిల్లాలోనే సుమారు మూడు వేల టన్నులకన్నా పైగా పనసపండు ఉత్పత్తి అవుతుంది. అధిక పోషక విలువలు కలిగి సహజంగా పెరిగే ఆరోగ్యకరమైన పనస పండు వలన గిరిజన ప్రాంతాలలో చాలా వరకు పోషకాహార సమస్య కూడా తగ్గించవచ్చు. అవగాహన లేమితో కొంతమంది పనస పండ్లను వృధాగా చేస్తూ, సరిగ్గా మార్కెట్ చేసుకోలేక పండ్లను పశువుల మేతగా, కుళ్ళబెట్టి ఎరువుగా వాడుతున్నారు. సంవత్సరంలో కొంతకాలమే దొరికినప్పటికి విటమిన్లు, ఖనిజలవణాలు, పీచు పదార్థాలు ఎక్కువగా ఉండటం వలన కొద్దిపాటి మెళకువలతో ఉప ఉత్పత్తులు తయారుచేసి దీర్ఘకాలం ఆహారంగా ఉపయోగించవచ్చు.

**1. పనస చిప్స్ : కావలసినవి :** పనస తొనలు, పసుపు, ఉప్పు, కారం, నీరు, పల్చటి గుడ్డ. **తయారీ విధానం :** పచ్చి పనస తొనలని పిక్కలు తీసి రెండు వైపులా కోసి, అర అంగుళం మందంలో తొన ఎంత పొడవు ఉంటే అంత పొడవుగా చేసుకోవాలి. నీటిలో ఉప్పు వేసి మరిగించి, కోసుకున్న చిప్స్‌ను పల్చటి గుడ్డలో కట్టి మరిగించిన నీటిలో 5 నిమిషాలు ఉంచి తీసిన తొనలని నూనెలో పసుపు వేసుకొని వేయించుకోవాలి.

**2. పనస మిక్చర్ : కావలసినవి :** పనస పొట్టు (జింజి) 1 కేజి, శనగపిండి 1/2 కేజి, నూనె 1/2 కేజి, ఉప్పు, కారం సరిపడునంత. **తయారీ విధానం :** శనగపిండిలో నీరు, ఉప్పు కలిపి వేసి మిక్చర్ పిండిలా చేసి అందులో పనసపొట్టు (జింజి) కలుపుకోవాలి. మరిగించిన నూనెలో పనసపొట్టుని (జింజి)ని శనగపిండిలో ముంచి నూనెలో వేయించాలి.

**3. పనస పకోడి : కావలసినవి :** 1/2 కేజి, పనస పిక్కలు 1/2 కేజి, శనగపిండి 1/2 కేజి, మిర్చి-4, ఉల్లిపాయలు-1/14 కేజి, అల్లం 1 టీ స్పూన్, కారము, నూనె సరిపడునంత. **తయారీ విధానం :** పనస పిక్కలు నీటిలో మరిగించుకొని పక్కన పెట్టుకోవాలి. శనగపిండిలో నీరు, పనసతొనలు, ఉడికిన పనస పిక్కలు, కోసుకున్న ఉల్లిపాయలు, మిర్చి, ఉప్పు కలుపుకొని పకోడీల్లా నూనెలో వేసుకోవాలి.

## ఆరోగ్య ప్రయోజనాలు

**జీర్ణశక్తి :** పనసపండులో పీచు పదార్థం పుష్కలంగా ఉండటం వల్ల జీర్ణశక్తిని మెరుగు పరుస్తుంది. అజీర్తి, అల్సర్లను కూడా నయం చేస్తుంది.

**క్యాన్సర్ :** దానిలోని యాంటీ ఆక్సిడెంట్లు, ఫైటోన్యూట్రియెంట్స్ క్యాన్సర్ వ్యాధిని నిరోధిస్తాయి.

**అధిక రక్తపోటు :** పొటాషియం మెండుగా లభించడం వలన అధిక రక్తపోటును తగ్గిస్తుంది. రక్తపోటు ఉన్నవారు పొటాషియం సమృద్ధిగా లభించే పనసపండును తీసుకుంటే సమస్య తీవ్రత తగ్గుతుంది.

**ఆస్తమా :** ఆస్తమాతో బాధపడేవారికి పనస పండు ఎంతో మేలు చేస్తుంది. పనసవేరును బాగా ఉడికించి దాని నుండి వచ్చే రసం తీసుకుంటే ఆస్తమా అదుపులో ఉంటుంది.



**పనసలో పోషక విలువల పట్టిక (ప్రతి 100 గ్రాములలో)**

| | | | |
|---|---|---|---|
| శక్తి/కాలరీలు | 94 | పిండిపదార్థాలు | 24 గ్రా. |
| మాంసకృత్తులు | 1 గ్రా. | క్రొవ్వు | 0.3 గ్రా. |
| పీచు గ్రా. | 2 గ్రా. | బీటకెరోటిన్ | 297 మైక్రోగ్రా |
| ఇనుము | 0.6 మి.గ్రా. | కాల్షియం | 34 మి.గ్రా. |
| విటమిన్-సి | 6.7 మి.గ్రా | ఫాస్పరస్ | 36 మి.గ్రా |
| పొటాషియం | 303 మి.గ్రా. | సోడియం | 3 మి.గ్రా. |

Source : Nutritive Value of Indian Foods - ICMR-2017



**ఎముకల పటుత్వం :** ఈ పండులో అధిక మెగ్నీషియం మరియు క్యాల్షియం ఉండటం వలన ఎముకలకు బలాన్ని చేకూర్చడానికి సహాయపడుతుంది.

**రక్తహీనత :** పనసపండులో ఉండే ఐరన్, రక్తహీనత సమస్య నివారిస్తుంది. కాబట్టి రక్తహీనతతో బాధపడేవారు పనసపండును తినడం ఆరోగ్యానికి మంచిది. పనసలో ఉండే విటమిన్లు మరియు ఖనిజాలు శరీరంలో ఎముకలలో రక్తం గడ్డకట్టకుండా మరియు రక్తం సజావుగా ప్రవహించేందుకు సహాయపడుతుంది. అంతే కాకుండా ఇందులో విటమిన్-సి ఉన్నందున, వ్యాధి నిరోధక శక్తిని మెరుగుపరుచును. అలాగే బాగా మగ్గిన పండు మనో ఉల్లాసాన్ని కలిగించి, అలసట తగ్గిస్తుంది. బరువును కూడా తగ్గిస్తుంది. ప్రతిరోజు పరగడుపున పనస తొనలు తినడం వలన పొట్ట నిండునట్లుగా ఉంటుంది. అందువలన తక్కువ ఆహారం తినటం వలన బరువు తగ్గుటకు అవకాశము ఉంది.

**థైరాయిడ్ గ్రంథి ఆరోగ్యానికి :** పనసపండులో ఉన్న ఖనిజ లవణాలు (మైక్రోమినరల్స్) థైరాయిడ్ గ్రంథి ఆరోగ్యాన్ని కాపాడు తాయి. శరీరంలో హార్మోన్ల ఉత్పత్తులు సమతుల్యంగా ఉంచేందుకు థైరాయిడ్ గ్రంథి ముఖ్యపాత్ర వహిస్తుంది.

**చర్మ సౌందర్యానికి :** చర్మ ఆరోగ్యానికి కలిగించే కణాలు త్వరగా నశించకుండా పనస కాపాడుతుంది. అలాగే ఇందులో వయసు మళ్ళే లక్షణాలు తగ్గించే గుణాలు ఉన్నాయి.

**మలబద్ధకం :** దీనిలో పీచు పదార్థం ఎక్కువగా ఉండటం వలన, అలా జారుడుగుణం కలిగివున్నందున మలబద్ధకాన్ని నివారిస్తుంది.



**దివ్య సుధ**
సీనియర్ సైంటిస్ట్
పలాస



# సమీకృత రైతు సమాచార కేంద్రం టోల్ ఫ్రీ నంబరు 155251 కు రైతుల ప్రశ్నలు - సమాధానాలు

## వ్యవసాయ పంటలు :

1. హనుమంతు ప్రసాద్, కాపేవరం గ్రా., తెనాలి మం., గుంటూరు జిల్లా, ఫోన్ : 9290268623.

**ప్ర. నువ్వుల పంట వేసి 20 రోజులు అయ్యింది. పొలంలో చిప్పర గడ్డి, ఊద కలుపు మొక్కలు ఎక్కువగా ఉన్నాయి. నివారణ తెలపండి?**

జ. నువ్వుల పంటలో గడ్డి జాతి కలుపు మొక్కల నివారణకు క్విజలోఫోప్–ఈథైల్, 2 మి.లీ.ను లీటరు నీటికి కలిపి కలుపు మొక్కలు బాగా తడిచేలా పిచికారి చేయాలి.

2. లక్ష్మణ్ రెడ్డి, తోటకూరపల్లి గ్రా., చౌడేపల్లి మం., చిత్తూరు జిల్లా, ఫోన్ : 7207921546.

**ప్ర. రబీ మొక్కజొన్న పంటలో పురుగు కాండాన్ని తొలిచేస్తున్నది. మొవ్వ చనిపోయి, ఎండిపోతోంది. నివారణ చెప్పగలరు?**

జ. అంతర పంటగా అపరాలు సాగుచేయడం, జొన్నను ఎర పంటగా 4 వరుసల్లో పంట చుట్టూ వేసుకుంటే పురుగును అరికట్టగలం. కాండం తొలుచు పురుగు నివారణకు క్లోరిపైరిఫాస్, 2.5 మీ.లీ. లేదా క్వినాల్ ఫాస్, 2.0 మీ.లీ. ను లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.

3. మురళి కృష్ణ, బొవినివారిపాలెం గ్రా., చీరాల మం., ప్రకాశం జిల్లా, ఫోన్ : 8186891172.

**ప్ర. వరిలోని వెన్ను మెడ భాగం వద్ద విరిగి కంకులు వాలిపోతున్నాయి? నివారణ తెలుపగలరు?**

జ. వరి పంటలో మెడ విరుపు తెగులు ఆశించినది. నివారణకు ఐసోప్రోథియోలిన్ 1.5 మి.లి. లేదా కాసుగామైసిన్ 2.5 మి.లి.ను లీటరు నీటికి చొప్పున కలుపుకొని పిచికారి చేయాలి.

4. మునియ్య, పోరుమామిళ్ల గ్రా., పోరుమామిళ్ల మం., వై.ఎస్.ఆర్. కడప జిల్లా, ఫోన్ : 7075868472.

**ప్ర. ప్రత్తి పంటలో ఆకు అడుగు భాగాన రసం పీల్చే పురుగులు ఉన్నాయి. నివారణ చెప్పగలరు?**

జ. ప్రత్తి పంటలో పేనుబంక నివారణకు ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా థయోమిథాక్సమ్ 0.2 గ్రా.ను లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి. ఎకరానికి 40 పసుపు మరియు నీలి రంగు జిగురు అట్టలను అమర్చుకోవాలి.

5. సౌజన్య, ఉప్పలూరు గ్రా., కంకిపాడు మం., కృష్ణా జిల్లా, ఫోన్ : 6309543809.

**ప్ర. మినుములో ఆకుల అంచులు ముడుచుకుని, గిడసబారి రాలిపోతున్నాయి. నివారణ తెలియజేయగలరు?**

జ. మినుములో తామర పురుగుల ద్వారా తల మొవ్వ కుళ్ళు లేదా తలమాడు తెగులు వైరస్ వ్యాపిస్తుంది. బెట్ట పరిస్థితుల్లో తెగులు ఉధృతి ఎక్కువగా ఉంటుంది. నివారణకు ఫిప్రోనిల్ 1.5 మి.లీ. లేదా ఎసిఫేట్ 1 గ్రా. లేదా థయోమిథాక్సమ్ 0.2 గ్రా.ను ఒకలీటరు నీటికిచొప్పున కలిపి పిచికారి చేయవలెను. ఎకరానికి 20 నీలి రంగు జిగురు అట్టలు పెట్టాలి.

6. ఝాన్సీ, నరసన్నపేట గ్రా., నరసన్నపేట మం., శ్రీకాకుళం జిల్లా, ఫోన్ : 7671069946.

**ప్ర. ప్రొద్దుతిరుగుడు పంటలో మొక్కలు వాడిపోయి చనిపోతున్నాయి. నివారణ తెలుపగలరు?**

జ. ప్రొద్దుతిరుగుడు పంటలో కాండం కుళ్ళు ఆశించింది. నివారణకు తెగులు సోకిన మొక్కలకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా.ను లీటరు నీటికి చొప్పున కలుపుకొని కాండం, వేర్లు తడిచేలా మొదల్లో పోసుకోవాలి. అలాగే చుట్టూ ఉన్న మొక్కలకు కూడా పోయాలి.

7. నిరంజన్, కొర్లపూడి గ్రా., కోట మం., నెల్లూరు జిల్లా, ఫోన్ : 7731082580.

**ప్ర. వేరుశనగ పంటలో ఆకులపై ముదురు గోధుమ రంగులో మచ్చలు ఏర్పడుతున్నాయి. నివారణ తెలుపగలరు?**

జ. వేరుశనగ పంటలో టిక్కా ఆకుమచ్చ తెగులు నివారణకు క్లోరోథలోనిల్ 2 గ్రా. లేదా హెక్సకొనాజోల్ 2 మి.లీ. లేదా టెబ్యుకోనజోల్ 1 మి.లీ.ను లీటరు నీటికి కలిపి వారం రోజుల వ్యవధితో 2 సార్లు పిచికారి చేసుకోవాలి.

"చీడపీడలపై మీ సందేహాలను 8331056152 కు వాట్సప్ ఫోటో పంపండి. వాటిని నివృత్తి చేసుకోండి."

8. విష్ణు, చిన్న అన్నలూరు గ్రా., కలిగిరి మం., నెల్లూరు జిల్లా, ఫోన్ : 9573382921.

**ప్ర. కంది నాటి 20 రోజులు అయ్యింది. కాయలో ఈగ ఎక్కువగా ఉన్నది. నివారణ తెలుపగలరు?**

జ. కంది పంటలో కాయ ఈగ నివారణకు ప్రొఫెనోఫాస్ 2 మి.లీ. లేదా క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ.ను లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.

## ఉద్యాన శాఖ :

1. ఎస్. రాజశేఖర్, వెంకటనాయనపల్లి గ్రా., ధోన్ మం., కర్నూలు జిల్లా, ఫోన్ : 9182896374

**ప్ర. బీర పంటలోఆకులు పండుబారుతున్నాయి మరియు అడుగు భాగంలో బూజు ఉంది. నివారణ తెలియజేయగలరు?**

జ. బీరలో బూజు తెగులు నివారణకు మాంకోజెబ్, మెటలాక్సీల్ 2 గ్రా. లేదా డైమిథోమార్ఫ్ం మాంకోజెబ్ 1.5 గ్రా.ను లీటరు నీటికి చొప్పున కలిపి ఆకులు రెండు వైపులా తడిచేటట్టు పిచికారి చేసుకోవాలి.

2. పి.రాజీవ్, మోట్లచేను గ్రా., కుప్పం మం., చిత్తూరు జిల్లా, ఫోన్ : 9666605713.

**ప్ర. 45 రోజుల టమాటా పంటలో ఆకులు చిన్నగా మారి ముడుచుకుపోతున్నాయి. నివారణ తెలపండి?**

జ. టమాటాలో తెల్లదోమ ద్వారా వ్యాప్తి చెందిన ఆకుముడత వైరస్ నివారణకు ఇమిడాక్లోరోప్రిడ్ 0.3 మి.లీ. లేదా ఫిప్రోనీల్ 2 మి.లీ. లేదా థయోమిథాక్సమ్ 0.3 గ్రా.ను లీటరు నీటికి చొప్పున పిచికారి చేసుకోవాలి. ఎకరానికి పొలంలో అక్కడక్కడ 4 పసుపు రంగు పూసిన రేకులకు ఆముదం లేదా గ్రీజ్ పూసి పెట్టాలి.

3. ఇ.సైదారెడ్డి, తుమ్మల చెరువు గ్రా., పిడుగురాళ్ళ మం., గుంటూరు జిల్లా, ఫోన్ : 9951072553.

**ప్ర. కాలీఫ్లవర్‌లో లేత ఆకుపచ్చ పురుగు కనిపిస్తోంది. నివారణ చర్యలు తెలుపగలరు?**

జ. ఇది కాలీఫ్లవర్ పంటలో వచ్చే రెక్కల పురుగు (డైమెండ్ బ్లాక్‌మాత్). నివారణకు నోవాల్యురాన్ 1 మి.లీ. లేదా స్పైనోసాడ్ 0.3 మి.లి.ను లీటరు నీటికి చొప్పున కలిపి కోతకు 15 రోజుల వ్యవధి ఉంటేనే పిచికారి చేయాలి.

4. నరసింహారెడ్డి, నాగంబత్తలపాడు గ్రా., తాళ్ళూరు మం., ప్రకాశం జిల్లా, ఫోన్ : 9866552034

**ప్ర. జామ పంటలో కాయలుపై చిన్న తుప్పు లేదా గోధుమ రంగు మచ్చలు కనిపిస్తున్నాయి. నివారణ తెలుపగలరు?**

జ. ఇది జామలోవచ్చే గజ్జి తెగులు. నివారణకు ప్రోపికొనజోల్ లేదా కార్బండిజమ్ 1 గ్రాము, మాంకోజెబ్ 2 గ్రా.ను లీటరు నీటికి చొ॥న 10-15 రో॥ల వ్యవధితో పిచికారి చెయ్యాలి.

5. ఎన్.సూర్యనారాయణరెడ్డి, చాపట్ల గ్రా., రాప్తాడు మం., అనంతపురం జిల్లా, ఫోన్ : 9533656217.

**ప్ర. మామిడిలో కాయ ముక్కు భాగంలో నల్లటి రంధ్రాలు ఉన్నాయి. నివారణకు ఏమి పిచికారి చేయాలి?**

జ. మామిడిలో కాయ తొలుచు పురుగు ఆశించినది. నివారణకు క్లోరోపైరిఫాస్ 2.5 మి.లీ.ను లీటరు నీటికి చొప్పున కలుపుకొని 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేసుకోవాలి.

6. కే.తేజ, వి.గుడివాడ గ్రా., తెనాలి మం., గుంటూరు జిల్లా, ఫోన్ : 9493924140

**ప్ర. గులాబీ పంటలో మొగ్గలు, పువ్వులు కుళ్ళిపోతున్నాయి. నివారణ తెలుపగలరు?**

జ. గులాబీ పంటలో మొగ్గ పువ్వు కుళ్ళు తెగులు నివారణకు 1 గ్రా. కార్బెండజీమ్ లేదా 1 మి.లీ. థయోఫినేట్ మిథైల్‌ను లీటరు నీటికి చొప్పున కలిపి 15 రోజుల వ్యవధిలో 2 సార్లు మందులను మార్చి పిచికారి చేసుకోవాలి.

7. ఎస్.బాబ్జి, యర్రవరం గ్రా., ఏలేశ్వరం మం., తూర్పు గోదావరి జిల్లా, ఫోన్ : 9490243852

**ప్ర. మునగ పంటలో సరైన ఎదుగుదల కనిపించుట్లేదు ఆకులుపసుపు రంగులోకి మారుతున్నాయి. నివారణ తెలియజేయగలరు?**

జ. మునగ పంటలో పోషక లోప నివారణకు ఒక్కో మొక్కకు 250 గ్రా.ల యూరియా, 300 గ్రా. భాస్వరం, 150 గ్రా. మ్యూరేట్ ఆఫ్ పోటాష్ ను మొదలు దగ్గర వేసుకోవాలి. పై పాటుగా పొటాషియమ్ నైట్రేట్ (13.0.45) ఏ 5 గ్రా.ను లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేసుకోవాలి..

8. ఏడుకొండలు, గొల్లవిడిటి గ్రా., యర్రగొండపాలెం మం., ప్రకాశం జిల్లా, ఫోన్ : 8465805430

**ప్ర. మల్లె మొగ్గలు సన్నగా ఉన్నాయి బాగా రావడానికి సలహా తెలుపండి?**

జ. మల్లెలో దిగుబడి పెరుగుటకు ఒక్కో మొక్కకు 100 గ్రా. యూరియా, 500 గ్రా. సింగిల్ సూపర్ ఫాస్ఫేట్,100 పొటాష్, 100 గ్రా. పశువుల ఎరువు వేసుకోవాలి.

**"సాగులో సందేహమా? 155251 కు ఫోన్ చేయండి. ఒక్క ఫోన్ కాల్‌తో అన్నదాతల సందేహాల నివృత్తి"**

# సమీకృత రైతు సమాచార కేంద్ర వాట్సప్ నెంబర్లకు వచ్చిన రైతుల సందేహాలు - సమాధానాలు

83310 56028
83310 56149
83310 56150
83310 56152
83310 56153
83310 56154

1. రమేష్ రెడ్డి, పెద్దబంగారునాథం గ్రా., కుప్పం మం., చిత్తూరు జిల్లా. ఫోన్ : 9538601550

ప్ర. వరిలో నల్లని పెంకు పురుగులు ఉన్నాయి. ఏమి చేయాలి?

జ. వరి పంటలో బ్లాక్ (మలయన్) బగ్ ఆశించినది. నివారణకు ప్రొఫెనోఫాస్ 2 మి.లీ. ను లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేసుకోవలెను.





2. హేమంత్, పత్రపల్లి గ్రా., వేంకటగిరి కోట మం., చిత్తూరు జిల్లా. ఫోన్ : 6300855520

ప్ర. అరటిలో బోదెలకు ఎర్రటి చారలతో పగుళ్లు ఏర్పడుతున్నాయి. నివారణ తెలపండి?

జ. అరటిలో బాక్టీరియా దుంప కుళ్లు తెగులు ఆశించిన మొక్కలను దుంపతో సహా తీసివేసి పూర్తిగా కాల్చివేయాలి. మొక్కలు తీసిన చోట మరియు చుట్టూ ఉన్న మొక్కల మొదళ్ల వద్ద 25 గ్రా. బ్లీచింగ్ పౌడర్ లేదా 50 గ్రా. సుడోమోనస్ ను లీటరు నీటికి కలిపి ప్రతి మొక్కకి పోయాలి. వరి, చెరకుతో పంట మార్పిడి చేయాలి.

3. కన్నూరి శ్రీనివాసు, కొమరవోలు గ్రా., రోలుగుంట మం., విశాఖపట్నం జిల్లా. ఫోన్ : 9290911119

ప్ర. మినుములో లేత ఆకులు పెళుసుగా మారి ముడుచుకు పోతున్నాయి. నివారణ తెలుపగలరు?

జ. మినుములో బొబ్బర తెగులు ఆశించింది. నివారణకు ఎసిఫేట్ 1 గ్రా. లేదా మోనోక్రోటోఫోస్ 1.6 మి.లీ. లేదా ఇమిడాక్లోరోప్రిడ్ 0.3 మి.లీ. లేదా థయోమిథాక్సమ్ 0.2 గ్రా. ను లీటరు నీటికి కలిపి పురుగు ఉధృతి తగ్గేంత వరకు వారం రోజులు వ్యవధితో మందులను మార్చి మార్చి 2 సార్లు పిచికారి చేయవలెను.





4. కె విజయ కుమార్, సింగసముద్రం గ్రా., రామకుప్పం మం., చిత్తూరు జిల్లా. ఫోన్ : 9849406051

ప్ర. పుచ్చ పంటలో కాయలపై తెల్లగా గోకిన మచ్చలు కనిపిస్తున్నాయి. నివారణ తెలియజేయగలరు?

జ. పుచ్చలో గుమ్మడి పెంకు పురుగు నివారణకు థయోడికార్బ్ 1 గ్రా. లేదా ప్రొఫెనోఫోస్ 2 మి.లీ.ను లీటరు నీటికి కలుపుకొని పురుగు ఉధ్రుతి తగ్గేంతవరకు వారం వ్యవధితో 2 సార్లు పిచికారి చేసుకోవాలి.



5. హనుమంతరావు, మద్రిపూడి గ్రా., కూచిపూడి మం., ప్రకాశం. ఫోన్ : 9948887211

ప్ర. నిమ్మ కాయల్లో గజ్జి లాంటి మచ్చలు ఉన్నాయి. నివారణకు ఏమి పిచికారి చేయాలి?

జ. నిమ్మ పంటలో గజ్జి తెగులు ఆశించింది. నివారణకు స్ట్రెప్టోసైక్లిన్ 1 గ్రా., కాపర్ ఆక్సీక్లోరైడ్ 30 గ్రా. ను 10 లీటర్ల నీటికి చొప్పున కలుపుకొని 20 రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారి చేసుకోవాలి.

**"చీడపీడలపై మీ సందేహాలను 8331056153 కు వాట్సప్ ఫోటో పంపండి. వాటిని నివృత్తి చేసుకోండి."**

6. రాజనాల మహేష్, మోటకంపల్లె గ్రా., ఐరాల మం., చిత్తూరు జిల్లా. ఫోన్: 9705769324



**ప్ర. పాలకూర ఆకుల్లో రంధ్రాలు ఏర్పడుతున్నాయి. నివారణ చెప్పగలరు?**

జ. పాలకూరలో గొంగళి పురుగు నివారణకు అజాడిరక్టిన్ (1500 పి.పి.ఎం.) 5 మి.లీ. లేదా 5% వేప కషాయం (50 గ్రా. గింజల పప్పును ఒక లీటరు నీటిలో 48 గంటలు నాన బెట్టి, వడకట్టగా వచ్చిన కాషాయం) ఒకదాని తరువాత మరియొకటి పురుగు ఉధృతి తగ్గేంతవరకు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.



7. సాయినాధ్, బీడుపల్లె గ్రా., పుట్టపర్తి మం., అనంతపురం జిల్లా. ఫోన్ : 7892700252

**ప్ర. రాగిలో లద్దె పురుగు ఆకులను కత్తిరించేస్తున్నది. నివారణకు ఏమి పిచికారి చేయాలి?**

జ. రాగి పంటలో లద్దె పురుగు నివారణకు క్లోరోపైరిఫాస్ 2.5 మి.లి.ను లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోండి.

8. సుభాష్, పత్రాపల్లి గ్రా., వెంకటగిరి కోట మం., చిత్తూరు జిల్లా. ఫోన్ : 9441027719



**ప్ర. ఆలుగడ్డ పంటలో ఆకులు చివర్లు మాడిపోతున్నాయి. నివారణ చెప్పండి?**

జ. బంగాళదుంప (ఆలుగడ్డ)లో లేట్ బ్లైట్ తెగులు నివారణకు మాంకొజెబ్ 2.5 గ్రా లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. లేదా క్లోరోథలోనిల్ 2 గ్రా.ను లీటరు నీటికి చొప్పున కలుపుకొని మొక్కలు బాగా తడిచేలా పిచికారీ చేయవలెను.



9. జి. నాగరాజు, వల్లాపల్లె గ్రా., బల్లికురవ మం., ప్రకాశం జిల్లా. ఫోన్ : 7780520376

**ప్ర. లిల్లీ పంటలో తెల్లని పిండి లాంటి పురుగులు ఆకులపై ఎక్కువగా ఉన్నాయి. నివారణ చెప్పగలరు?**

జ. ట్యూబరోజ్ (లిల్లీ)లో పిండిపురుగు నివారణకు ప్రొఫెనోఫాస్ 2 మి.లీ. లేదా డైమిథోయేట్ 2 మి.లీ. లేదా ఎసిఫేట్ 1.5 గ్రా.ను, 0.5 గ్రా. సబ్బును ఒక లీటరు నీటికి చొప్పున కలిపి మొక్కలు పూర్తిగా తడిసేటట్లుగా 2 సార్లు పిచికారి చేయాలి.

10. శ్రీనివాసరావు, గెడ్డనపల్లె గ్రా., కిర్లంపూడి మం., తూర్పు గోదావరి జిల్లా. ఫోన్ : 8897796300



**ప్ర. నువ్వులలో ఆకులపై మచ్చలు వచ్చాయి. నివారణ తెలుపగలరు?**

జ. నువ్వుల్లో ఆకుమచ్చ తెగులు నివారణకు కార్బండిజిమ్, మాంకొజెబ్ 2.5 గ్రా.ను లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేసుకోవాలి.

**"సాగులో సందేహమా? 155251 కు ఫోన్ చేయండి. ఒక్క ఫోన్ కాల్‌తో అన్నదాతల సందేహాల నివృత్తి"**

# సమీకృత రైతు సమాచార కేంద్రానికి రైతులు తరచూ అడిగే ప్రశ్నలు

1. సత్తి బాబు, సామర్లకోట గ్రా., సామర్లకోట మం., తూర్పు గోదావరి జిల్లా, ఫోన్ : 7386883326

**ప్ర. వరిలో కాండం, మట్ట ఆకులపై పెద్ద మచ్చలు ఏర్పడాయి. నివారణ చెప్పగలరు?**

జ. వరిలో పాముపొడ తెగులు నివారణకు హెక్సాకొనజోల్ 2 మి.లీ. లేదా వాలిడామైసిన్ 2 మి.లీ.ను లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

2. వెంకటేశ్వర్లు, పుల్లలచెరువు గ్రా., ఇటవరం మం., ప్రకాశం జిల్లా, ఫోన్ :7569788359

**ప్ర. పెసర పంటలో ఆకులపై చిన్న చిన్న పురుగులు ఉన్నాయి, ఆకులు వంకర్లు పోతున్నాయి. నివారణ తెలుపగలరు ?**

జ. పెసర పంటలో పేనుబంక ఉంది. నివారణకు డైమీథోయేట్ 2 మి.లీ.ను లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.

3. నక్కా విజయ్, జలపవారి గూడెం గ్రా., కామవరపు కోట మం., పశ్చిమ గోదావరి జిల్లా, ఫోన్ : 9100523584

**ప్ర. మొక్కజొన్నలో ఆకులు పసుపుబారి ఎండిపోతున్నాయి. నివారణకు ఏమి చేయాలి?**

జ. మొక్కజొన్న పంటలో ఆకు ఎండు తెగులు నివారణకు మాంకోజెబ్ 2.5 గ్రా.ను ఒక లీటరు నీటికి చొప్పున కలిపి వారం రోజుల వ్యవధితో 2 సార్లు పిచికారీ చేసుకోవాలి.

4. శ్రీనివాసులు, కొమరవోలు గ్రా., రోలుగుంట మం., విశాఖపట్నం జిల్లా, ఫోన్ : 9290911119

**ప్ర. మినుము పంటలో ఆకు ముడతలో పురుగు ఉంది. నివారణ చెప్పండి?**

జ. మినుములో ఆకు ముడత ఆశించినది దాని నివారణకు క్లోరైపైరిఫోస్ 2.5 మీ.లీ.ను లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవలెను.

5. పి. రాంబాబు, ఆర్.కాంతలపాడు గ్రా., కర్నూలు మం., కర్నూలు జిల్లా, ఫోన్ : 6300206796

**ప్ర. కంది కాయల్లో రంధ్రాలు ఉండి, లోపల పురుగులు గింజలను తింటోంది. నివారణకు ఏమి పిచికారి చేయాలి?**

జ. కంది పంటలో మారుకా మచ్చల పురుగు నివారణకు నోవాల్యూరాన్ 1 మి.లీ. లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 0.3 మి.లీ.ను ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవలెను.

6. గొల్ల గోవర్ధన్, రామాపురం గ్రా., పెనుకొండ మం., అనంతపురం జిల్లా, ఫోన్ : 8374364002

**ప్ర. చామంతి ఆకులపై చిన్న చిన్న పురుగులు ఉన్నాయి. నివారణ చెప్పండి?**

జ. చామంతిలో పచ్చపురుగు ఆశించినది. నివారణకు థయోడికార్బ్ 1.5 గ్రా. లేదా ఎసిఫేట్ 1 గ్రా.ను లీటరు నీటితో కలిపి వారం రోజుల వ్యవధితో 2 సార్లు మొక్కలు పూర్తిగా తడిసేటట్లుగా పిచికారి చేసుకోవాలి.

7. పి. ప్రకాశరాజు, బైటమంజులూరు గ్రా., జె. పంగలూరు మం., ప్రకాశం జిల్లా, ఫోన్ : 9392097330

**ప్ర. గుమ్మడి పంటలో ఆకులపై లేత, ముదురు గోధుమ రంగు పెద్ద మచ్చలు ఏర్పడ్డాయి. నివారణ తెలియజేయండి?**

జ. గుమ్మడి పంటలో బూజు తెగులు నివారణకు మెటలాక్సిల్, మాంకోజెబ్ 2 గ్రా. లేదా డైమెథోమార్ఫ్, మాంకోజెబ్ 1.5 గ్రా.ను లీటరు నీటికి చొప్పున కలిపి 2 సార్లు మందులను మార్చి మార్చి పిచికారి చేసుకోవాలి.

8. సి.హెచ్.స్వామి నాయుడు, వంతలమామిడి గ్రా., పాడేరు మం., విశాఖపట్నం జిల్లా, ఫోన్ : 9494546444

**ప్ర. జీడి మామిడి లేత చిగుర్లు మరియు పూత ఎండిపోయి రాలిపోతున్నాయి. నివారణ చెప్పగలరు?**

జ. జీడిమామిడి పంటలో టీ–దోమ ఆశించినది. నివారణకు లీటరు నీటికీ 1.6 మి.లీ. మోనోక్రోటోఫోస్ కలిపి పిచికారీ చేసుకోవాలి. రెండవ పిచికారి పూత వచ్చిన తరువాత లాయాడాసైహలోత్రిన్ 0.6 మీ.లీ. లేదా క్లోరోపైరిఫాస్ 2 మీ.లీ.ను లీటరు నీటికీ కలిపి పిచికారి చేయాలి.

9. జయశేఖర్, పెదవేగి గ్రా., పెదవేగి మం., పశ్చిమ గోదావరి, జిల్లా, ఫోన్ : 9550441764

**ప్ర: బొప్పాయిలో ఆకులు పసుపుబారి, పూత రాలిపోతుంది. నివారణ తెలపండి?**

జ. బొప్పాయిలో ఆకులు పసుపుగా మారటం మరియు పూత రాలటం నివారణకు ఎకరానికి 13–0–45, 1 కేజీ మరియు ఫార్ములా–4, 1 కేజీ రెండు కలిపి పిచికారి చేసుకోవలెను.

10. రామకోటయ్య, కంకనాలపల్లే గ్రా., త్రిపురాంతకం మం., ప్రకాశం జిల్లా, ఫోన్ : 9959286004.

**ప్ర. వేసవిలో ప్రత్తి పంట వేయాలనుకుంటున్నాను. సలహా ఇవ్వగలరు?**

జ. ప్రత్తిలో ప్రధాన పురుగు అయినటువంటి గులాబీ రంగు కాయతొలుచు పురుగు ఎక్కువగా ఆశిస్తున్న ప్రాంతాల్లో వేసవిలో కూడా ప్రత్తిని సాగు చేస్తున్నట్లైతే పురుగు ఉధృతి గణనీయంగా పెరిగి అదుపు చేయలేము. వేసవిలో లోతు దుక్కులు చేస్తే భూమిలో ఉన్న కోశస్థదశలను నాశనం చేయవచ్చు. పంటను వాయిదా వేయడం వల్ల పురుగుకు పంట అందుబాటులో లేకపోవడం వల్ల చనిపోతుంది. అందుకని వేసవిలో ప్రత్తి సాగును ప్రోత్సహించటం లేదు.

**"చీడపీడలపై మీ సందేహాలను 8331056154 కు వాట్సప్ ఫోటో పంపండి. వాటిని నివృత్తి చేసుకోండి."**




# రైతుల స్పందన

మినుము పంటలో ఆకుముడత, తెల్లదోమ నివారణకు ఐ.సి.సి. వారి సలహా మేరకు ఎసిఫేట్ 1.0 గ్రా.ను ఒక లీటరు నీటికి చొప్పున కలుపుకొని పిచికారి చేసాను. పురుగు ఉధృతి తగ్గింది. ఐ.సి.సి. వారికి నా ధన్యవాదాలు.

సురేశ్ కూమార్, మోదుమూడి గ్రా., అవిసగడ్డ మం., కృష్ణా జిల్లా. ఫోన్ : 8309302871.

మహేశ్, కుందూరు గ్రా., కె.గంగవరం మం., తూర్పు గోదావరి జిల్లా, ఫోన్ : 9573045977.

వరిలో కాండంతొలుచు పురుగు నివారణకు సమీకృత రైతు సమాచార కేంద్రం వారి సలహా మేరకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 2 గ్రా. ను ఒక లీటరు నీటికి చొప్పున కలుపుకొని పిచికారి చేసాను. పురుగు ఉధృతి తగ్గింది. సమాచార కేంద్రం వారికి నా ధన్యవాదాలు.

మామిడిలో తేనె మంచు పురుగు నివారణకు రైతు సమాచార కేంద్రం వారిని సంప్రదించి ఇమిడాక్లోరోప్రిడ్ 0.3 మి.లీ.ను ఒక లీటరు నీటికి చొప్పున కలుపుకొని పిచికారి చేసాను. పురుగు తగ్గింది. సరైన సలహా ఇచ్చిన సమాచార కేంద్రం వారికి నా ధన్యవాదములు.

రమేశ్, కొత్తకోట గ్రా., బుక్కపట్నం మం., సత్యసాయి జిల్లా, ఫోన్ : 8555870122

ఎస్. లోకేశ్వర రెడ్డి, పైసంపల్లె గ్రా., వీరపునాయునిపల్లి మం., కడప జిల్లా. ఫోన్ : 9490364468.

నువ్వుల పంటలో పచ్చ దోమ నివారణకు ఐ.సి.సి. వారి సలహా మేరకు మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ.ను ఒక లీటరు నీటికి చొప్పున కలుపుకొని పిచికారి చేసాను. పురుగు తగ్గింది. మంచి సలహా ఇచ్చిన సమాచార కేంద్రం వారికి ధన్యవాదాలు.

జామలో గజ్జి తెగులు నివారణకు రైతు సమాచార కేంద్రం వారి సలహా మేరకు కార్బండిజిమ్, మాంకోజెబ్ 2 గ్రా.ను లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేశాను. తెగులు ఇతర భాగాలకు సోకలేదు. పంట బాగుంది. సమాచార కేంద్రం వారికి ధన్యవాదాలు.

వి. నరసింహా రెడ్డి, నాగంబొట్లపాడు గ్రా., తాళ్ళూరు మం., ప్రకాశం జిల్లా, ఫోన్ : 9866552034.

రాజు, జగ్గంపేట గ్రా., జగ్గంపేట మం., తూర్పు గోదావరి జిల్లా, ఫోన్ : 8466888551.

జీడి మామిడి తోటలో టీ-దోమ నివారణకు రైతు సమాచార కేంద్రం వారి సలహా మేరకు లీటరు నీటికి 2 మి.లీ. ప్రొఫెనోఫాస్ చొప్పున కలుపుకొని పిచికారి చేసాను. మంచి ఫలితం కనిపించింది. సమస్య తగ్గింది. ఐ.సి.సి. వారికి నా ధన్యవాదాలు

"సాగులో సందేహమా? 155251 కు ఫోన్ చేయండి. ఒక్క ఫోన్ కాల్‌తో అన్నదాతల సందేహాల నివృత్తి"

# ఉత్తమ సేవలందిస్తున్న ఆర్.బి.కె. సిబ్బంది



**బి. గణేష్**
డిజిపురం గ్రా., కంచిలి మం.,
శ్రీకాకుళం జిల్లా



**పైలా రాము**
ఆర్. రామచంద్రాపురం గ్రా., దత్తిరాజేరు మం.,
విజయనగరం జిల్లా



**టి. గౌరీనాయుడు**
పొత్తనపూడి గ్రా., వి. మాడుగుల మం.,
విశాఖపట్నం జిల్లా



**చింతాకుల లవరాజు**
జగన్నైకులపాలెం గ్రా.,
రామచంద్రాపురం మం., తూర్పు గోదావరి జిల్లా



**కుమార్ తొర్లపాటి**
కె. గోకవరం గ్రా., లింగపాలెం మం.,
పశ్చిమ గోదావరి జిల్లా



**కోటె రాజేష్**
అయ్యంకి గ్రా., మొవ్వ మం.,
కృష్ణా జిల్లా



**వెంకట రెడ్డి**
మున్నంగివారిపాలెం గ్రా.,
చుండూరు మం., గుంటూరు జిల్లా



**చాట్ల సుజాత**
కందులూరు గ్రా., టంగుటూరు మం.,
ప్రకాశం జిల్లా



**పూనూరు ప్రవీణ్ కుమార్**
ఊటుకూరు గ్రా.,
విడవలూరు మం., నెల్లూరు జిల్లా



**జి. వెంకటేష్ రాజు**
కమలాపురం గ్రా., కమలాపురం మం.,
కడప జిల్లా



**కత్రావత్ పట్నాయక్**
సంకేసుల గ్రా., అవుకు మం.,
కర్నూలు జిల్లా



**టి.వి. పార్థసారధి**
కంచిసముద్రం గ్రా., లేపాక్షి మం.,
సత్యసాయి జిల్లా



**ఎమ్.ఎస్. ప్రశాంత్**
మైదూరు గ్రా.,
పిచ్చాటూరు మం.,
చిత్తూరు జిల్లా

# ఆంధ్రప్రదేశ్

## జిల్లాలు - 26




1. శ్రీకాకుళం
2. పార్వతీపురం మన్యం
3. విజయనగరం
4. విశాఖపట్టణం
5. అనకాపల్లి
6. అల్లూరి సీతారామరాజు
7. తూర్పు గోదావరి
8. కాకినాడ
9. కోనసీమ
10. పశ్చిమ గోదావరి
11. ఏలూరు
12. ఎన్టీఆర్
13. కృష్ణా
14. గుంటూరు
15. పల్నాడు
16. బాపట్ల
17. ప్రకాశం
18. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు
19. వైఎస్సార్
20. తిరుపతి
21. చిత్తూరు
22. అన్నమయ్య
23. నంద్యాల
24. కర్నూలు
25. అనంతపురం
26. శ్రీ సత్యసాయి

సూచన :

- జిల్లా కేంద్రాలు : 26
- జిల్లా సరిహద్దు